ప్రజాశక్తి

సోమవారం 21 జూలై 2025 | 8 పేజీలు

ఎన్‌టిఆర్

కృష్ణా

విజయవాడ పాత బస్టాండ్ వద్ద ధర్నాలో సిపిఎం రాష్ట్ర నాయకులు సిహెచ్.బాబురావు, డి.కాశీనాథ్ తదితరులు

ఆర్‌టిసి స్థలాల పరిరక్షణకు ఐక్య ఉద్యమం

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబురావు
- విజయవాడ పాత బస్టాండ్‌ను లూలూ కంపెనీకి అప్పగించొద్దని ధర్నా

వార్త మెయిన్‌లో

తిరువూరు ఉద్యోగి అదృశ్యం కథ సుఖాంతం

ప్రజాశక్తి - తిరువూరు : ఆత్మహత్య చేసుకుంటున్నట్లు లెటర్ రాసి అదృశ్యమైన ఎన్‌టిఆర్ జిల్లా తిరువూరులోని జల వనరుల శాఖ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు (ఎఇఇ) వేసుపోగు కిషోర్ కథ సుఖాంతంగా ముగిసింది. దీంతో పోలీసులు, కుటుంబ సభ్యులు ఊపిరిపీల్చుకున్నారు. రాజమండ్రిలో ప్రత్యక్షమైన కిషోర్‌ను పోలీసులు ఆదివారం ఉదయం 8 గంటల సమయంలో పట్టుకున్నారు. అనంతరం తిరువూరు పోలీసుస్టేషన్‌కు తీసుకొచ్చారు. తనను బదిలీ చేసి కూడా రిలీవ్ ఆర్డర్ ఇవ్వకుండా జలవనరుల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఇఇ, స్పెషల్ డివిజన్, విజయవాడ) పి.గంగయ్య, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (డిఇఇ, స్పెషల్ సబ్ డివిజన్, కంచికచర్ల) ఎస్.ఉమాశంకర్, తిరువూరు ఎంఎల్‌ఎ కొలికపూడి శ్రీనివాసరావు తొక్కిపట్టి మానసికంగా వేధిస్తున్నారని, వారి రాజకీయ నాటకంలో తాను అలసిపోయానని, అందుకే ఆత్మహత్య చేసుకుంటున్నానని, తన చావుకు కారణం వారేనని కిషోర్

కిషోర్‌ను ఆయన మామకు అప్పగిస్తున్న ఎస్ఐ సత్యనారాయణ

(మిగతా 2లో)

మళ్లీ పెరిగిన ఎరువుల ధరలు

- కాంప్లెక్స్ ధర రూ.50 నుంచి రూ.100 వరకు పెంపు
- అధికంగా పొటాష్‌పై రూ.250 పెరుగుదల
- రైతులపై రూ.7.66 కోట్ల భారం

ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి

రైతుల గోడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పట్టడం లేదు. పంటలకు కనీస మద్దతు ధరలు అందక అవస్థలు పడుతున్న రైతులపై కేంద్రం ప్రతి ఏటా ఎరువుల భారం మోపుతోంది. ఈ ఖరీఫ్ సీజన్‌లోనూ మరోసారి ఎరువులు ధరలు పెరిగాయి. డిఎపి, యూరియా మినహా ఇతర కాంప్లెక్స్ (మిశ్రమ) ఎరువుల 50 కిలోల బ్యాగ్‌పై సగటున రూ.100, మ్యూరిట్ ఆఫ్ పొటాష్ (ఎంఒపి)పై రూ.150 వరకు ధరలు పెంచింది. దీంతో రైతులకు పంటల సాగు పెట్టుబడి పెరగనుంది. ఎరువుల వినియోగ అంచనాలను పరిశీలించినప్పుడు అన్నదాతలపై ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో మొత్తం రూ.7.66 కోట్ల మేర భారం పడనుందని అంచనా. ఖరీఫ్ సీజన్‌లో కృష్ణాజిల్లా వ్యాప్తంగా లక్షా 68 వేల 459 హెక్టార్లలో వరి, 148 హెక్టార్లలో మొక్కజొన్న, 15 హెక్టార్లలో కంది, 7 హెక్టార్లలో పెసర, 901 హెక్టార్లలో మినుము, 790 హెక్టార్లలో వేరుశనగ, 360 హెక్టార్లలో పత్తి, 6,294 హెక్టార్లలో చెరకు పంటలు సాగవుతాయి. మొత్తం లక్షా 76 వేల 974 హెక్టార్ల విస్తీర్ణంలో

ఎరువు రకం	గతేడాది ధర	ఈ ఏడాది ధర
14-35-14	రూ.1725	రూ.1,800
20-20-0-13	రూ.1250	రూ.1,350
10-26-26	రూ.1650	రూ.1,800

సాగవుతున్న వివిధ పంటలకు 38,300 టన్నుల యూరియా, 28,500 టన్నుల కాంప్లెక్స్ ఎరువులు, 10,500 టన్నుల డిఎపి, 7,300 టన్నుల సూపర్ పాస్పెట్, 3,920 టన్నుల ఎంఒపి చొప్పున మొత్తం 88,520 టన్నుల మేర ఎరువులు అవసరం అవుతాయని వ్యవసాయశాఖ అంచనా వేసింది.

రైతులపై మరోసారి భారం

వ్యవసాయ పంటలకు దుక్కి, దమ్ము దశలో డిఎపిని భూమిలో వేస్తారు. తర్వాత దశలో ఎక్కువగా కాంప్లెక్స్ ఎరువులు యూరియా, పొటాష్‌లతో కలిపి వినియోగిస్తారు. వరితో

(మిగతా 2లో)

ఊహాలోకంలో...

- కలగానే 'బంగారు కుటుంబాలు'
- దత్తతకు ముందుకు రాని మార్గదర్శులు !
- పి-4 మరో 'జన్మభూమి', 'శ్రమదానం' అవుతుందా !!

ప్రజాశక్తి - కలెక్టరేట్ (కృష్ణా) : స్వర్ణాంధ్ర విజన్ 2047 లక్ష్యంలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన పి-4 (పబ్లిక్ ప్రైవేట్ పీపుల్స్ పార్టనర్షిప్) ఊహలకే పరిమితమైంది. 'బంగారు కుటుంబాల' పథకంపై కష్ణా జిల్లాలో నీలినీడలు అలముకుంటున్నాయి. పి-4 ప్రపంచంలోనే ఒక గొప్ప కార్యక్రమమని, మెరుగైన సమాజ నిర్మాణానికి రూపకల్పన చేసిన ఘనత సిఎం చంద్రబాబుకు దక్కుతుందని ఓ వైపు ప్రజాప్రతినిధులు ప్రచారాన్ని ఉదర గొడుతున్నారు. క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితులు అందుకు విరుద్ధంగా ఉన్నాయి. జీవితంలో ఉన్నతంగా స్థిరపడిన వ్యక్తుల సహకారంతో దిగువ కుటుంబాలను పైకి తీసుకురావాలన్నదే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని, 2029 నాటికి సమాజంలో పేదరికాన్ని జీరో స్థాయికి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, ఈ ప్రణాళిక ద్వారా పేదరిక నిర్మూలన, సమాజ అభివద్ధికి మౌలిక సదుపాయాలు, విద్య, వైద్యం అందించేందుకు సాధ్యపడుతుందని ప్రజా ప్రతినిధులు చెబుతున్నారు. పి-4 పథకం సమాజంలోని అగ్రశ్రేణి 10 శాతం ధనవంతులను ప్రోత్సహించి, దిగువన ఉన్న 20 శాతం పేదలను దత్తత తీసుకొని వారికి మద్దతు ఇచ్చేలా చేస్తుందని, ధనవంతులు మార్గదర్శులుగా వ్యవహరిస్తూ దిగువన ఉన్న బంగారు కుటుంబాలకు చేయూతనందించేలా చేస్తుందన్న కూటమి ప్రభుత్వ ప్రజా ప్రతినిధులు చెబుతున్న మాటలు ఆచరణలో సాధ్యమయ్యేలా కనిపించడంలేదు. ఎందుకంటే గుర్తించిన బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవడానికి ఆర్థికంగా స్థిరపడిన సంపన్నులు ముందుకు రావడానికి ఇష్టపడటం లేదని క్షేత్ర స్థాయిలో ప్రభుత్వ సిబ్బంది చెబుతున్న మాట. ఏదో ఒకరోజైతే ఎంతో కొంత సాయం చేయడానికి కొంత మక్కువ చూపుతున్నారని, అలా కాకుండా గుర్తించిన బంగారు కుటుంబాలను వారు స్థిరపడే వరకు సహాయం చేయాలంటే మార్గదర్శులు ముందుకు రావడం లేదని అధికార వర్గాల్లో వినబడుతున్న మాట. జిల్లా కలెక్టర్ తీవ్ర స్థాయిలో కషి చేస్తున్నప్పటికీ

(మిగతా 2లో)

పల్లపు ప్రాంతాలు జలమయం

- భారీ వర్షంతో స్తంభించిన జన జీవనం
- రోడ్లపైకి మురుగునీరు

విజయవాడ బస్టాండ్ లోబ్రిడ్జి వద్ద చేరిన నీరు

ప్రజాశక్తి - విజయవాడ : ఎన్‌టిఆర్, కృష్ణాజిల్లాల్లో ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. దీంతో పలు కాలనీలు జలమయమయ్యాయి. పల్లపు ప్రాంతాల్లోకి నీరు చేరింది. కొద్దిసేపు జనజీవనం స్తంభించింది. రోడ్లపై వర్షం నీరు పారింది. దీంతో రహదారులు తటాకాలుగా దర్శనమిచ్చాయి. చిరు వ్యాపారులకు అంతరాయం ఏర్పడింది. ముఖ్యంగా విజయవాడ నగరంలో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. మురుగు కాల్వలు పొంగాయి. రోడ్లపై వర్షం నీరు పెద్దఎత్తున నిలిచిపోయింది. నగరంలో రాత్రి 7 నుంచి 9 గంటల వరకు భారీ వర్షం కురుస్తూనే ఉంది. కష్ణలంక, రాణిగారి తోట, పటమట, భవానీపురం, చిట్టినగర్, పాల ఫ్యాక్టరీ, విద్యాధరపురం, సింగ్‌నగర్, పాయకాపురం, కండ్రిక, ప్రకాష్‌నగర్, వాంబే కాలనీ, పైపుల రోడ్డు సెంటర్, గాంధీనగర్, గవర్నరుపేట, సత్యనారాయణపురం, హనుమాన్ పేట, సిద్ధార్థ పాలీ క్లినిక్ రోడ్డు, పటమట రైతు బజార్, ఆటోనగర్ తదితర ప్రాంతాలు జలమయమయ్యాయి. విజయవాడ బస్‌స్టేషన్ ప్రాంగణంలోకి నీరు చేరింది. బస్సులు పార్కింగ్ చేసే ప్రాంతంలో భారీ ఎత్తున నీరు నిలిచిపోయింది. పీఎం బస్ స్టేషన్ సమీపంలోని రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద మోకాలి వరకు నీరు నిలిచిపోయింది. అలాగే కాళేశ్వరం మార్కెట్ సమీపంలోని

(మిగతా 2లో)

జిజిహెచ్‌లో ఎంపి మిథున్ రెడ్డికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ఎంపి మిథున్ రెడ్డికి ఆదివారం నగరంలోని కొత్త ప్రభుత్వాస్పత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించారు. మధ్యాహ్నం 12 గంటలకు భారీ బందోబస్తుతో నగరంలోని ఆసుపత్రికి ఆయనను తీసుకువచ్చారు. వైద్యులు సాధారణ వైద్య పరీక్షలైన బిపి, షుగర్, ఈసిజీ పరీక్షలతో పాటు ఫిట్నెస్ పరీక్షలు నిర్వహించారు. మిథున్‌రెడ్డిని నగరంలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకువస్తున్నారనే సమాచారంతో ఉదయ 10 గంటలకే పెద్దఎత్తున వైసిపి శ్రేణులు అక్కడికి చేరుకున్నాయి. అయితే పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేసి ఆస్పత్రి ఆవరణలోకి ఎవరినీ అనుమతించలేదు. వైద్య పరీక్షల అనంతరం నగరంలోని ఎసిబి కోర్డులో ఆయనను సిట్ అధికారులు హాజరుపరిచారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ

'అమ్మ' ఆసరాతో బంగారు భవితకు బాసట

కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : వ్యాపారం, వాణిజ్యం, కళలు.. వంటి అన్ని రంగాల్లో ప్రత్యేక గుర్తింపు కలిగిన విజయవాడలో పేద కుటుంబాల పిల్లలు బాగా చదువుకొని, ఉన్నతంగా ఎదగడానికి ఆర్థిక సమస్యలు అడ్డంకి కాకూడదనే ఉద్దేశంతో 'అమ్మ' అందిస్తున్న ప్రోత్సాహం, సహకారం చిన్నారుల బంగారు భవితకు బాసటగా నిలుస్తుందని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. ఆంధ్రా మోటార్ మర్చంట్స్ అసోసియేషన్ (అమ్మ) ఆధ్వర్యంలో ఆదివారం మొగల్రాజపురం అమ్మ కళ్యాణమండపంలో పేద కుటుంబాల విద్యార్థులకు ఉపకారవేతనాల పంపిణీ కార్యక్రమానికి కలెక్టర్ లక్ష్మీశ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మ అసోసియేషన్.. ఈ ఏడాది 408 మందికి రూ. 16.50 లక్షలు ఉపకారవేతనాలతోపాటు నోటు పుస్తకాలు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. దాదాపు 300 బంగారు కుటుంబాలకు మార్గదర్శులుగా వ్యవహరించేందుకు, మొగల్రాజపురంలోని బోయపాటి శివరామకష్ణయ్య మునిసిపల్ పాఠశాలను 'అమ్మ' దత్తత తీసుకోవడం అభినందనీయమన్నారు. అమ్మ అధ్యక్షులు గారపాటి సతీష్‌బాబు మాట్లాడుతూ ఆటోనగర్, గవర్నర్‌పేటలో ఆటోమొబైల్ దుకాణాల్లో పనిచేసే సిబ్బంది, కుటుంబాల విద్యార్థులకు ఇప్పటివరకు రూ.కోటి విలువైన నోట్ పుస్తకాలను అందించామన్నారు. ఉపాధ్యక్షులు జి.వెంకట సుబ్బారావు, దోనేపూడి దుర్గాప్రసాద్, ప్రధాన కార్యదర్శి సుంకర చంద్రశేఖర్, సంయుక్త కార్యదర్శి కె.దుర్గామల్లికార్జునరావు, అసోసియేషన్ మాజీ అధ్యక్షులు మిరియాల వెంకటేశ్వరరావు, జిల్లా రెడ్‌క్రాస్ వైస్ ఛైర్మన్ డాక్టర్ వెలగాజోషి పాల్గొన్నారు.

డాన్స్ పోటీల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : సింగిల్ యూస్ ప్లాస్టిక్ నిషేధం, స్వచ్ఛ విజయవాడ కార్యక్రమాలను ప్రజల్లోకి అవగాహన పెంచేందుకు డాన్స్ కాంపిటీషన్స్ నిర్వహిస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి లక్ష్మీశ తెలిపారు. ఆదివారం సాయంత్రం హరిత బరం పార్క్ లో డాన్స్ కాంపిటీషన్స్ కట్టర్ ట్రెజర్ కార్యక్రమంలో పాల్గొని డాన్స్ కాంపిటీషన్స్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వచ్చే ఆదివారం జూలై 27, 2025న హరితబరం పార్క్ లో డాన్స్ కాంపిటీషన్స్ ప్రారంభం అవుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ కె. చైతన్య, వెస్ట్ ఎమ్మార్వో షేక్

ఇంతియాజ్, విజయవాడ నగరపాలక సంస్థ వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ బి సోమశేఖర్ రెడ్డి, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్నపూర్ణ, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్‌టిసి పాత బస్టాండ్ వద్ద సిపిఐ ధర్నా

ప్రజాశక్తి - విజయవాడ : ప్రభుత్వ ఆస్తులను కారుచౌకగా లులూ సంస్థకు అప్పగించడంపై సిపిఐ విజయవాడ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు మండిపడ్డారు. విజయవాడ పాత బస్టాండ్ స్థలాన్ని, విద్యాధరపురం డిపోలను లూలూ కంపెనీకి అప్పగించడాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ఆదివారం సిపిఐ ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు. పాత బస్టాండ్ వద్ద జరిగిన ఈ ధర్నాలో కోటేశ్వరరావు మాట్లాడుతూ ఆర్‌టిసి ఆస్తులను అప్పగించడాన్ని ఉపసంహరించు కోవాలన్నారు.

మంచినీటి పైప్‌లైన్ పనులు ప్రారంభం

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : మంచినీటి సరఫరా వాటర్ పైప్ లైన్ పనులను 50వ డివిజన్ సిపిఎం కార్పొరేటర్ బోయి సత్యబాబు ఆదివారం ప్రారంభించారు. ప్రజల ఫిర్యాదులను విఎంసి కమిషనర్ ధ్యానచంద్ర దృష్టికి కార్పొరేటర్ సత్యబాబు తీసుకెళ్లారు. స్పందించిన కమిషనర్ రూ.13 లక్షల వ్యయంతో కొత్త హెచ్‌డిపి వాటర్ పైప్‌లైన్ పనులు మంజూరు చేశారు. ఈ సందర్భంగా సత్యబాబు మాట్లాడుతూ ఇప్పటివరకు రూ.5 కోట్ల విలువైన అభివద్ధి పనులను మంజూరు చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జి.ఆదిలక్ష్మి, సిపిఎం డివిజన్ నాయకులు పి.రాజు, జి.నాగ రాజు, సిఐటియు నాయకులు ఏ రమేష్, ఏ శ్రీను పాల్గొన్నారు.

కొనసాగుతున్న పిఎన్ఎం శిక్షణా శిబిరం

ప్రజాశక్తి - విజయవాడ : నగరంలోని బిఆర్‌టిఎస్ రోడ్డులోని శ్రామిక భవనంలో జరుగుతున్న ఆంధ్ర ప్రజానాట్యమండలి శిక్షణ శిబిరం ఆదివారానిక రెండో రోజుకు చేరుకుంది. ఈ శిక్షణా శిబిరంలో మూడు పాటలు, మూడు డాన్సులు, నాటిక, కోలాటం నేర్పించారు. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపాల్‌గా ఆషా వ్యవహరిస్తున్నారు. ప్రజానాట్య మండలి ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి అప్పన్న, జిల్లా అధ్యక్షులు జివి రంగారెడ్డి, సీనియర్ నాయకులు సిహెచ్.అప్పారావు, ఆండ్రాదేవి, లక్ష్మీ, తోట శ్రీదేవి, లాస్య, డివైఎఫ్ఐ నాయకులు శివ, తదితరులు పాల్గొన్నారు. ఆంధ్ర ప్రజానాట్యమండలి ఎన్టీఆర్ జిల్లా కమిటీ ఆధ్వర్యాన ఈ శిక్షణా శిబిరం శనివారం ప్రారంభమైంది. ఈ శిబిరం ఈనెల 21వ తేదీ వరకు కొనసాగుతుంది. మొదటి రోజు శిక్షణలో మహిళా కళాకారులు పాల్గొన్నారు. లఘు నాటికకు పిఎన్ఎం కవి, పాటల శిక్షణకు పి.అప్పన్న శిక్షణ ఇచ్చారు.

మంచి ఆలోచనలకు అక్షర రూపం ఇవ్వాలి : కలెక్టర్

ప్రజాశక్తి - విజయవాడ : మేధో వికాసం మానవ ఉనికికి అంతిమ లక్ష్యం కావాలన్న డా.బీఆర్ అంబేద్కర్ సూక్తిని నిజం చేస్తూ భావి తరానికి వెలుగుబాట వేసేలా మంచి ఆలోచనలకు సలక్షణంగా అక్షర రూపమివ్వడం ఓ కళ అనిజిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. ఎంజి రోడ్డులోని డా. బీఆర్ అంబేద్కర్ స్మృతివనం ఆవరణలో ఆదివారం మల్లెతీగ సాహిత్యసేవాసంస్థ ఆధ్వర్యంలో 'ప్రణామం' కవి సమ్మేళనం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కలెక్టర్ లక్ష్మీశ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో సుప్రసిద్ధ కవులతోపాటు మల్లెతీగ కలిమిశ్రీ, చొప్పా రాఘవేంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను సత్కరిస్తున్న కలిమిశ్రీ, రాఘవేంద్రశేఖర్

మొదటిపేజీ తరువాయి

ఊహాలోకంలో...

క్షేత్ర స్థాయిలో ఆశించిన ఫలితాలు రావడంలేదు.

ఇప్పటి వరకు కష్ణా జిల్లాలో 68,948 బంగారు కుటుంబాలను సచివాలయాల సిబ్బంది ద్వారా గుర్తించారు. అందులో 2,723 బంగారు కుటుంబాలను 344 మంది మార్గదర్శులు దత్తతు తీసుకున్నారు. అలాగే మచిలీపట్నం నియోజకవర్గంలో 9,778 బంగారు కుటుంబాలను గుర్తించామని, అందులో 398 బంగారు కుటుంబాలను 106 మంది మార్గదర్శకులు మాత్రమే దత్తత తీసుకున్నారని అధికార వర్గాలు చెబుతున్నాయి. అయితే వీటిలో చాలావరకు తప్పుడు లెక్కలు ఉన్నట్లు తెలుస్తోంది. ఎందుకంటే ప్రభుత్వం ఒత్తిడి తట్టుకోలేక కొన్ని అనధికార మార్గదర్శులను గుర్తించినట్లు ఆరోపణలు వస్తున్నాయి. అయితే ప్రభుత్వం మార్గదర్శులను గుర్తించి జాబితాలను క్షేత్రస్థాయికి పంపితే కొంత ఉపయోగకరంగా ఉంటుందనేది కిందిస్థాయి అధికారులు అభిప్రాయపడుతున్నారు. అలా కాకుండా క్షేత్ర స్థాయిలో ఉన్న ప్రభుత్వ సిబ్బందిపై మార్గదర్శులను గుర్తించే బాధ్యత పెడితే ఎలా సాధ్య పడుతుందని పలువురు అధికారులు పేర్కొంటున్నారు. క్షేత్రస్థాయిలో మార్గదర్శులను గుర్తించాలంటే స్థానిక ప్రజా ప్రతినిధుల సహకారం చాలా అవసరం. అలా కాకుండా కేవలం క్షేత్ర స్థాయి ప్రభుత్వ సిబ్బందిపై మాత్రమే ఈ బాధ్యత పెడితే బంగారు కుటుంబాలు కల కలగానే మిగిలిపోతుంది.

రెండు రకాలుగా బంగారు కుటుంబాలు గుర్తింపు..

ప్రభుత్వం రెండు రకాలుగా బంగారు కుటుంబాలను గుర్తించాలని పేర్కొంది. అందులో ఆర్థిక, ఆర్థికేతర అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని పేర్కొంది. ఆర్థికంగా వెనుకబడిన వారిని గుర్తించి వారికి ఆర్థిక సహాయం అందించి పైకి తీసుకురాలి. రెండవది ఆర్థికేతరులను గుర్తించి వారికి ఆయా రంగాల్లో శిక్షణ ఇచ్చి వారు జీవితంలో స్థిర పడేలా చేయడం. వీరిని దత్తత తీసుకున్న మార్గదర్శులు వీరికి శిక్షణ ఏ విధంగా ఇస్తారనేది అర్థం కానీ ప్రశ్నగా మిగిలిపోతోంది. గతంలో చంద్రబాబు పాలనలో గ్రామాలను అధికారులు దత్తత చేసుకోవాలంటూ ఆదేశాలు జారీచేసిన సంగతి తెలిసిందే. జన్మభూమి, శ్రమదానం కార్యక్రమాలు అప్పట్లో విఫలమైన సంగతీ తెలిసిందే. మళ్లీ ఇప్పుడు పి-4 లాంటి కార్యక్రమం పాతా సీసాలో కొత్త సారాలా ఉందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

తిరువూరు ఉద్యోగి అదృశ్యం కథ సుఖాంతం

లేఖ రాసి ఉద్యోగుల వాట్సప్ గ్రూపుల్లో పెట్టి ఈనెల 18న అదశ్యమైన విషయం తెలిసిందే. అతని మామ జామ ఆనందరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు తిరువూరు ఎస్ఐ సత్యనారాయణ మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కిషోర్ ఫోను సిగ్నల్స్ ఆధారంగా ఈనెల 19వ తేదీ ఉదయం ఏడు గంటలకు విశాఖపట్టణం రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్నట్లు లోకేషన్ రావడంతో ఇద్దరు కానిస్టేబుళ్లు, అతని మామయ్యతో కలిసి వెళ్ళారు. లోకేషన్ చూపిన ప్రాంతంలో గాలించారు. అయితే కిషోర్ ఫోను స్విచ్ఛాఫ్ చేసి ఉండటంతోపాటు వారికి లొకేషన్ చూపిన ప్రదేశంలో అతను కనిపించలేదు. చివరకు రాజమండ్రిలోని గోదావరి పుష్కర్ ఘాట్ వద్ద ఉన్నట్లు ఫోన్ కాల్ లొకేషన్ చూపించడంతో ఆ ప్రదేశానికి వెళ్లి గాలించారు. అక్కడ కిషోర్ కనిపించడంతో ఊపరిపీల్చుకున్నారు. అనంతరం తిరువూరు పోలీసుస్టేషన్‌కు తీసుకొచ్చారు. దీంతో ఎఇఇ కిషోర్ అదశ్యం కేసు సుఖాంతంగా ముగిసింది. ఎస్ఐ సత్యనారాయణ అతని మామ ఆనందరావుకు కిషోర్‌ను అప్పగించారు. తనకు రిలీవ్ ఆర్డర్ ఇవ్వనందునే మనస్థాపానికి గురై ఆత్మహత్య చేసుకోవడానికి వెళ్లినట్టు కిషోర్ చెప్పాడని ఎస్ఐ తెలిపారు.

మళ్లీ పెరిగిన ఎరువుల ధరలు

పోల్చుకుంటే ఉద్యాన పంటల్లో కాంప్లెక్స్ ఎరువుల వినియోగం ఎక్కువగా ఉంటుంది. గతం కన్నా ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో కాంప్లెక్స్ ఎరువుల 50 కిలోల బస్తాపై సగటున రూ.100, పొటాష్‌పై రూ.250 చొప్పున ధరలను కేంద్రం పెంచింది. దీంతో జిల్లాలో రైతులు వినియోగించే కాంప్లెక్స్ ఎరువులు 28,500 టన్నులపైన సగటున రూ.5.70 కోట్లు, 3,920 టన్నుల ఎంఒపిపై కోటీ 17 లక్షల 60 వేల రూపాయల మేర అదనపు భారం రైతులపై పడుతోంది.

పల్లపు ప్రాంతాలు జలమయం

రైల్వే అండర్ బ్రిడ్జి కింద కూడా నీరు భారీ స్థాయిలో నిలిచిపోయింది. చిరు వ్యాపారులకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సాయంత్రం నుంచి ఆకాశం మేఘావతమైంది. ఆరు గంటల సమయంలో చిరుజల్లులతో ప్రారంభమైన వర్షం ఏడు గంటలకు భారీ వర్షంగా మారింది. రాత్రి 9 గంటల తర్వాత కూడా వర్షం పడుతూనే ఉంది. ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కారణంగా ప్రజలు కొంత ఇబ్బందులకు గురయ్యారు. మున్సిపల్ కార్మికుల సమ్మె కారణంగా వీధుల్లో పేరుకుపోయిన చెత్త దుర్గంధ పూరితంగా తయారైంది. నగరపాలక సంస్థ అధికారులకు కూడా ఏం చేయాలో పాలుపోని పరిస్థితి ఏర్పడింది. లోతట్టు ప్రాంతాల్లో నీటిని బయటకు పంపించేందుకు వాహనాలు, మోటార్లు అందుబాటులో లేక, కార్మికులు కూడా సమ్మెలో ఉండడంతో ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

కోర్టు ప్రకటన

మహారాజ శ్రీ పశ్చిమ గోదావరి జిల్లా: ఏలూరు 8వ అదనపు జిల్లా జడి (యస్.సి, యస్.టి)వారి కోర్టులో
ఇ.పి.నెం:127/ 2024
ఇన్ ఒ.యస్ నెం: 353/2015
(2వ అదనపు జడ్జి విజయవాడ వారి కోర్టు ఫైల్)
బిట్వీన్:-
పెనుమత్స జగన్నాథరాజు......... డిక్రీ హెల్డార్
మరియు
1)మెస్సర్స్ యుగంధర్ హౌసింగ్ ప్రవేట్ లిమిడెడ్, విజయవాడ రిప్రజెంటెండ్ బై మేనేజింగ్ డైరెక్టర్ ముప్పవరపు మహేశ్వరరెడ్డి తండ్రి రాఘవరెడ్డి, హిందువు పురుషుడు, వయస్సు 49సం॥ ఆఫీసు డోర్ నెం: 52-1/1-1, 1వ అంతస్థు వినాయక థియేటర్ దగ్గర, వెటర్నరీ కాలనీ, విజయవాడ -8 ,
2)ముప్పవరపు మహేశ్వరరెడ్డి తండ్రి రాఘవరెడ్డి, హిందువు పురుషుడు,వయస్సు 49సం॥ రిప్రజెంటెండ్ బై మేనేజింగ్ డైరెక్టర్ మెస్సర్స్ యుగంధర్ హౌసింగ్ ప్రవేట్ లిమిడెడ్, విజయవాడ ఆఫీసు డోర్‌నెం: 52-1/1-1, 1వ అంతస్థు వినాయక థియేటర్ దగ్గర, వెటర్నరీ కాలనీ, విజయవాడ-8 1,2.....జె.డి.అర్స్
పై నెంబరు ఇ.పి ని డిహెచ్.ఆర్ గారు దావా డిక్రీ తేది.23-02-2023 ప్రకారం సదరు డిక్రీ బాకీ, ఖర్చులు మరియు ఇ.పి ఖర్చులతో సహా వసూలు చేసి రాబట్టుకొనే నిమిత్తం మీ ఇరువురు పైన తెలిపిన వారి కోర్టులో ఇ.పి దాఖలు చేయడమైనది. సదరు కేసులో మీలో 1వ వారు నోటీసు తీసుకొనకుండా కాలాయాపన చేయుచున్నందున సదరు నోటీసును పేపరు ప్రకటన ద్వారా మీపై అమలు నిమిత్తం ది. 15-07-2025 నుండి 25-07-2025కి వాయిదా వేసినారు. కావున మీరుది.25-07-2025 ఉదయం 10.30గం॥లకు స్వయంగా గాని లేక మీతరుపున వాదనలుగాని ,అభ్యంతారాలు గాని తెలియ పరుచు కోవచ్చును. అట్లు లేని యెడలశ్రీ కోర్టువారు సదరు పిటీషన్ మీ పరోక్షమున తీర్మానించి సదరు సొమ్ము ఇ.పిషెడ్యూలుఆస్థికోర్టు ద్వారావేలంవేయించి బాకీ సొమ్ము యావత్తును రాబట్టడం అగునని ఇందుమూలంగా తెలియజేయడం మైనది.
(శ్రీకోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదా తేది: 25-07-2025
ఇట్లు:- టి.వి నవకుమార్
కె.అర్.రాఘవేంద్రరావు
పిటీషనర్ / డి.హెచ్.ఆర్ తరుపున న్యాయవాదులు
గాంధీనగర్, విజయవాడ-530003
Vijayawada,
Date 19-07-2025.

కోర్టు ప్రకటన

మహారాజశ్రీ పశ్చిమ గోదావరి జిల్లా: ఏలూరు 8వ అదనపు జిల్లా జడ్జి (యస్.సి, యస్.టి) వారి కోర్టులో
ఇ.పి.నెం:125/ 2024
ఇన్ ఒ.యస్ నెం: 351/2015
(2వ అదనపు జడ్జి విజయవాడ వారి కోర్టు ఫైల్)
బిట్వీన్:-
కూసంపూడి అనురాధ......... డిక్రీ హెల్డార్
మరియు
1)మెస్సర్స్ యుగంధర్ హౌసింగ్ ప్రవేట్ లిమిడెడ్, విజయవాడ రిప్రజెంటెండ్ బై మేనేజింగ్ డైరెక్టర్ ముప్పవరపు మహేశ్వరరెడ్డి తండ్రి రాఘవరెడ్డి, హిందువు పురుషుడు, వయస్సు 49సం॥ ఆఫీసు డోర్ నెం: 52-1/1-1, 1వ అంతస్థు వినాయక థియేటర్ దగ్గర, వెటర్నరీ కాలనీ, విజయవాడ ,
2)ముప్పవరపు మహేశ్వరరెడ్డి తండ్రి రాఘవరెడ్డి, హిందువు పురుషుడు,వయస్సు 49సం।మెస్సర్స్ యుగంధర్ హౌసింగ్ ప్రవేట్ లిమిడెడ్, విజయవాడ । ఆఫీసు డోర్‌నెం: 52-1/1-1, 1వ అంతస్థు వినాయక థియేటర్ దగ్గర, వెటర్నరీ కాలనీ, విజయవాడ.-8
.... .1,2.జె.డి.అర్స్
పై నెంబరు ఇ.పి ని డిహెచ్.ఆర్ గారు దావా డిక్రీ తేది.23-02-2023 ప్రకారం సదరు డిక్రీ బాకీ, ఖర్చులు మరియు ఇ.పి ఖర్చులతో సహా వసూలు చేసి రాబట్టుకొనే నిమిత్తం మీ ఇరువురు పైన తెలిపిన వారి కోర్టులో ఇ.పి దాఖలు చేయడమైనది. సదరు కేసులో మీలో 1వ వారు మరియు 2వ వారు నోటీసు తీసుకొనకుండా కాలాయాపన చేయుచున్నందున సదరు నోటీసును పేపరు ప్రకటన ద్వారా మీపై అమలు నిమిత్తం ది. 15-07-2025 నుండి 25-07-2025కి వాయిదా వేసినారు. కావున మీరు ది.25-07-2025 ఉదయం 10.30గం॥లకు స్వయంగా గాని లేక మీతరుపున వాదనలుగాని ,అభ్యంతారాలు గాని తెలియ పరుచు కోవచ్చును. అట్లు లేని యెడల శ్రీ కోర్టువారు సదరు పిటీషన్ మీ పరోక్షమున తీర్మానించి సదరు సొమ్ము ఇ.పిషెడ్యూలు ఆస్థికోర్టు ద్వారా వేలం వేయించి బాకీ సొమ్ము యావత్తును రాబట్టడం అగునని ఇందుమూలంగా తెలియజేయడంమైనది.
(శ్రీకోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదా తేది: 25-07-2025
ఇట్లు:- టి.వి నవకుమార్
కె.అర్.రాఘవేంద్రరావు
పిటీషనర్ / డి.హెచ్.ఆర్ తరుపున న్యాయవాదులు
గాంధీనగర్, విజయవాడ-530003
Vijayawada,
Date 19-07-2025.

రేపు విద్యుత్ వినియోగదారుల అవగాహన సదస్సు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : కన్స్యూమర్ గ్రీవెన్స్ ఫోరం (సిజిఆర్ఎఫ్) విజయవాడ వారి ఆధ్వర్యంలో విద్యుత్ వినియోగదారులకు అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించనున్నట్లు గుడివాడ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీ జి.బి.శ్రీనివాసరరావు ఆదివారం తెలిపారు. హనుమాన్‌జంక్షన్‌లోని ఎస్.ఆర్ కన్వెన్షన్ హాల్(రాయల్ హంపి) విజయవాడ రోడ్డులో జరిగే ఈ కార్యక్రమం ఉదయం 10:30 గంటల నుండి మధ్యాహ్నం 1:30గంటల వరకు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సిజిఆర్ఎఫ్ చైర్మన్ శ్రీ విక్టర్ ఇమ్మాన్యుయేల్, ఫార్మర్ డిస్ట్రిక్ట్ సెషన్స్ జడ్జి, ఫోరం సభ్యులు, సూపరింటెండింగ్ ఇంజనీర్, మచిలీపట్నం, విద్యుత్ అధికారులు పాల్గొంటారని తెలిపారు. డివిజన్‌లోని విద్యుత్ వినియోగదారులు తమ ఫిర్యాదులను వాతపూర్వకంగా సర్వీస్ కనెక్షన్ నెంబర్, పూర్తి అడ్రస్, సెల్ నెంబర్‌తో అర్జీ ఇచ్చి సమస్య పరిష్కరించుకోవాలని సూచించారు.

మాట్లాడుతున్న ఎంఎల్ఎ వెంకట్రావు

కెడిసిసి పథకాలపై రైతులకు అవగాహన కల్పించాలి :యార్లగడ్డ

ప్రజాశక్తి-హనుమాన్ జంక్షన్ (గన్నవరం) : రైతుల సంక్షేమం కోసం కృష్ణా కోఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ అమలు చేస్తున్న పథకాలను రైతులకు వివరించే బాధ్యతను కొత్తగా నియమితులైన పిఎసిఎస్ చైర్మన్ తీసుకోవాలని ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు సూచించారు. బాపులపాడు మండలంలో బాపులపాడు గ్రామ పిఎసిఎస్ చైర్మెన్‌గా వడ్డీ శివ నాగేశ్వరరావు, కాకులపాడు చైర్మెన్‌గా యుజ్జవరపు శ్రీనివాసరావు, బిళ్ళనపల్లి చైర్మన్ గా బెజవాడ వాసు, కొత్తపల్లి గ్రామ చైర్మన్ గా వడ్డీ అశోక్, నలుగురి ప్రమాణ స్వీకారోత్సవం ఆదివారం ఉదయం హనుమాన్ జంక్షన్‌లోని కళ్యాణ మండపంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన యార్లగడ్డ మాట్లాడుతూ జిల్లా రైతాంగానికి మేలు చేసేందుకు కేడీసీసీ పలు పథకాలను అమలు చేస్తుందని వాటిని పిఎసిఎస్ చైర్మన్లు ఇంటింటికి తిరిగి రైతులకు వివరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ సమన్వయకర్త చలమలశెట్టి రమేష్ బాబు, మండల టిడిపి అధ్యక్షులు దయ్యాల రాజేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి పుట్టా సురేష్, టిడిపి నాయకులు మూల్పూరి సాయి కళ్యాణి, కొమ్మారెడ్డి రాజేష్, కాటూరి విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీల విజేతలకు బహుమతులు

ప్రజాశక్తి-ఉయ్యూరు : విద్యతో పాటు ఆటపాటలు, కరాటే, మార్షల్ ఆర్ట్స్ వంటి వాటిపట్ల చిన్ననాటినుండి ఆసక్తి పెంపొందించుకుని అన్ని రంగాల్లో రాణించాలని ఉయ్యూరు సీఐ టీవీవీ రామా రావు అన్నారు. ఏజీఅండ్ఎస్ఎస్ కళాశాలలో నివాస్ కరాటే అండ్ మార్షల్ ఆర్ట్స్ అ కాడమి ఇండియా ఆధ్వర్యంలో కరాటే నేర్చుకున్న విద్యార్థులకు నిర్వహించిన కరాటే బెల్ట్ గ్రేడింగ్ పోటీల్లో విజేతలకు ఆదివారం బహుమతులు, సర్టిఫికెట్లు అందజేసే కార్యక్రమంలో సీఐ పాల్గొన్నారు. ఈసందర్భంగా విజేతలను అభినందించి మాట్లాడారు. కరాటేవల్ల స్వీయ రక్షణ, ఇతర ప్రయోజనాలు తెలియజేసారు. జిల్లా యోగా అసోసియే షన్ అధ్యక్షుడు జి. కష్ణ, నివాస్ కరాటే అండ్ మార్షల్ ఆర్ట్స్ అకాడమి ఇండియా అధ్యక్షుడు డి.శ్రీనివాస్ పాల్గొని విజేతలను అభినందించారు.

విజేతలతో ఉయ్యూరు సీఐ రామారావు, కరాటే కోచ్ శ్రీనివాసరావు

కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

70 మందికి ఉచిత కంటి పరీక్షలు

ప్రజాశక్తి-చల్లపల్లి : పేద కుటుంబాల్లో అంధత్వ నిర్మూలన ధ్యేయంగా వాసవీ క్లబ్ కృషి చేస్తున్నట్లు వాసవీ క్లబ్ చల్లపల్లి శాఖ అధ్యక్షురాలు మాజేటి అమరవాణి తెలిపారు. కొల్లిపర మధు ఆర్థిక సహకారంతో చల్లపల్లి వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి పరీక్ష శిబిరం నిర్వహించారు. ఈసీబిరంలో హెూమియో వైద్యం మోహన్రావు 70 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 20 మందికి కంటి శుక్లముల తొలగింపు తొలగింపు కోసం ఎంపిక చేసినట్లు ఆమె తెలిపారు. ఉచిత హెూమియో వైద్య శిబిరంలో డాక్టర్ తమ్మన సాయి మణికంఠ వైద్య సేవలు అందచేశారు. ఆయా శిబిరాలను క్లబ్ కార్యదర్శి గోళ్ళ వెంకట రత్నం, దింటకుర్తి జ్యోతి, తమ్మన సతీష్, నంబూరు కుసుమ కుమారి, జూపూడి కిరణ్, ఉరిమి సువర్చల పర్యవేక్షించారు.

ప్రభుత్వాసుపత్రిలో ఉపకరణాలపై వర్క్‌షాప్

ప్రజాశక్తి మచిలీపట్నంఅర్బన్ : మచిలీపట్నం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి పిల్లల విభాగంలో పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ గౌరీ ఆధ్వర్యంలో పిల్లల వైద్య పరికరాలు, అల్ట్రాసౌండ్ , పలు అంశాలపై ఆదివారం వైద్యులకు, పీజీ డాక్టర్లకు వర్క్ షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరిండెంట్ ఆశాలత, ఆర్ఎంఓ నిరంజన్, డాక్టర్ బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారిణి ఆశాలత మాట్లాడుతూ చిన్నపిల్లల విభాగంలో వైద్యులు అల్ట్రాసౌండ్ పలు పరికరాలపై వర్క్ షాప్ నిర్వహించి అవగాహన కల్పించడం ప్రభుత్వాసుపత్రిలో ఇది మొదటిసారి అని ఈ కార్యక్రమం మంచి పరిణామం అన్నారు. వైద్య విద్యార్థులకు, పీజీ వైద్య విద్యార్థులకు వర్క్ షాపు ఉపయోగప డుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ హారిక, డాక్టర్ రాజా అశోక్, డాక్టర్ రవికుమార్, డాక్టర్ ఇందుశ్రీ ,డాక్టర్ అనురూప, డాక్టర్ సురేంద్రబాబు పాల్గొన్నారు.

కార్మికుల ఐక్యతతోనే సమస్యల పరిష్కారం : సిఐటియు

ప్రజాశక్తి చల్లపల్లి : ఏపీ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ సిఐటీయు అనుబంధం చల్లపల్లి మండల విస్తృత సమావేశం ఎస్ విజయలక్ష్మి అధ్యక్షతన ఆదివారం యూనియన్ కార్యాలయంలో జరిగింది. పంచాయతీ కార్మికులు సమైక్యంగా ఉంటే సమస్యల పరిష్కారమవుతాయని సిఐటియు మండల కన్వీనర్ మహమ్మద్ కరీముల్లా కార్మికులకు సూచించారు. అలాగే కార్మికులకు వేతనాలు పెంచాలని, కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జీవో నెంబర్ 551 జీవో ప్రకారం పంచాయతీ కార్మికులకు గుర్తింపు కార్డులు, కనీస వేతనాలు,పిఎఫ్, చేయాలని కోరారు. పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు ఆరోగ్య రక్షణ పరికరాలు ఇవ్వాలన్నారు. మండల గ్రామపంచాయతీ కార్మిక సంఘం అధ్యక్షులు కనగాల ప్రసాద్,కోశాదికారి చోరగుడి వెంకటేశ్వరరావు, ఆర్ ఐ, లక్ష్మీపురం శ్రీనివాస్,మద్దాల శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మహ్మద్ కరీముల్లా

దమయంతి మృతికి నివాళి

ప్రజాశక్తి-బంటుమిల్లి : బంటుమిల్లికి చెందిన వెంట్రపాటి నాగేశ్వరరావు సతీమణి వెంట్రపాటి దమయంతి (82) వయోభారంతో ఆదివారం మృతిచెందారు. నాగేశ్వరరావు సిపిఎం బంటుమిల్లి డివిజన్ కార్యదర్శిగా, సిపిఎం బందరు డివిజన్ కమిటీ సభ్యులుగా సుదీర్ఘ కాలం పాటు పనిచేశారు. ఆయన అడుగుజాడల్లో దమయంతి నడిచారు. వీరికి నలుగురు సంతానం. ఇద్దరు మగవారు, ఇద్దరు ఆడవారు. వీరిలో పెద్ద కుమారుడు వెంట్రపాటి శ్యాము సిపిఎం మండల కమిటీ సభ్యునిగా, రైతు సంఘం బాధ్యులుగా పనిచేస్తున్నారు. ఆమె భౌతిక కాయాన్ని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఆర్‌సిపి రెడ్డి, పరుచూరి ధనశ్రీ, రైతు సంఘం జిల్లా కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరరావు, సిపిఎం మండల కార్యదర్శి మాజేటి శివ శ్రీనివాసరావు, మండల కమిటీ సభ్యులు లంకదాసుల అజయ్ ఘోష్, బొడ్డు నాగరాజు, పొదిలి వెంకన్న తదితరులు సందర్శించి నివాళులర్పించారు. దమయంతి మరణ వార్త తెలియగానే సిపిఎం జిల్లా కార్యదర్శి వై నరసింహారావు, రాష్ట్ర కమిటీ సెక్రటేరియట్ సభ్యులు వి ఉమామహేశ్వరరావు వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

పామర్రులో కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ రాజేంద్రప్రసాద్

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

ప్రజాశక్తి - పామర్రు : మనసు మార్చుకుని మంచిగా జీవిస్తే నేరస్తులకు కూడా గౌరవం లభిస్తుందని పామర్రు స్టేషన్ ఎస్ఐ వి. రాజేంద్రప్రసాద్ అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్లో ఆదివారం ఆయన రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షణికావేశంలో జీవితాలను నాశనం చేసుకోవద్దని, ఒక తప్పుకు జీవితాంతం బాధపడాల్సి వస్తుందని అన్నారు. నేరాలకు దూరంగా ఉండి సత్ప్రవర్తనతో జీవిస్తూ మరికొందరికి ఆదర్శంగా నిలవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. **ప్రజాశక్తి - గుడివాడ :** అనుకోని కొన్ని సంఘటనల వల్ల, దురుసుగా ప్రవర్తించి, చెడు వ్యసనాలకు అలవాటు పడి జీవితాన్ని నాశనం చేసుకోవద్దని 1టౌన్ సి.ఐ శ్రీనివాస్ సూచించారు. ఆదివారం స్థానిక 1టౌన్ పోలీసు స్టేషన్‌లో స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు సిఐ శ్రీనివాస్ కౌన్సిలింగ్ ఇచ్చారు.

నిబంధనలు పాటించని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి :ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-ఉయ్యూరు : నిబంధనలకు విరుద్ధంగా ఆదివారం రోజున కూడా ప్రత్యేక తరగతులు అనే నెపంతో ఉయ్యూరులోని కొన్ని పాఠశాలలు ఉదయం ఏడు గంటల నుండే మొదలయ్యి సాయంత్రం ఏడు గంటల వరకు నిర్వహిస్తున్నారని, వీటిపై మండలంలోని విద్యాశాఖ చర్యలు శూన్యమని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎస్.సమరం ఆక్షేపించారు. నారాయణ స్కూల్ యాజమాన్యం నిబంధనలను బేఖాతరరు విద్యార్థులపై ఒత్తిడి పెంచుతూ తరగతులు నిర్వహిస్తుందని సమరం అన్నారు. ఈ దశలో భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న నారాయణ స్కూల్ తరగతులని అడ్డుకుని విద్యార్థుల్ని ఇంటికి పంపించారు. విద్యాశాఖ అధికారులకు సమాచారం అందించినా ఎలాంటి చర్యలు లేవన్నారు. క్లాసులు నిర్వహించడానికి అనుమతి తీసుకున్నామని చెబుతున్న ఆ ఫ్యాకల్టీపై, స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ ఉపాధ్యక్షులు సలీం, ఎస్ఎఫ్ఐ సహాయ కార్యదర్శి నాగేంద్ర, ఎస్ఎఫ్ఐ ఉయ్యూరు నాయకురాలు హారిక విద్యార్థి సంఘ నాయకులు జగన్ , పవన్ సాయి తదితరులు పాల్గొన్నారు

యాజమాన్యాన్ని ప్రశ్నిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

రేపు రౌండ్‌టేబుల్ సమావేశం

ప్రజాశక్తి-మొవ్వ : ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 22వ తేదీ మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు కూచిపూడిలోని కాంచనరావు భవనంలో ప్రజాసంఘాల ఐక్యవేదిక రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు సిపిఎం మండల కార్యదర్శి శీలం నారాయణరావు తెలిపారు. ఈ సమావేశానికి ప్రజాసంఘాల జిల్లా నాయకులు పాల్గొంటారని తెలిపారు. విద్యుత్ భారాలు తగ్గించాలని, స్మార్ట్ మీటర్ల బిగింపు నిలుపుదల చేయాలనే అనే అంశంపై ప్రజా సంఘాల ఐక్యవేదిక రౌండ్ టేబుల్ సమావేశంలో చర్చించనున్నట్లు తెలిపారు. మండల ప్రజా సంఘాలు, అన్ని రంగాల వర్తక వ్యాపా స్తులు, కార్మిక కర్షకులు అధిక సంఖ్యలో పాల్గొని ఐక్య వేదిక రౌండ్ టేబుల్ సమావేశాన్ని విజయవంతం చేయాలని నారాయణరావు తెలిపారు.

మృతురాలి తండ్రికి పరామర్శ

ప్రజాశక్తి-అవనిగడ్డ : గాజుల మురళీకృష్ణ కుమార్తె లాస్య అనారోగ్యంతో శనివారం మృతిచెందగా మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు ఆదివారం మురళీకృష్ణను పరామర్శించారు వేకనూరు శివారు గాజులవారిపాలెం మురళీకష్ణ ఇంటికి వెళ్లి వారిని పరామర్శించి లాస్యకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి చింతలపూడి లక్ష్మీనారాయణ, వేకనూరు ఎంపిటిసి వర్రే నరేష్, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షులు చింతలపూడి బాలు, పార్టీ సీనియర్ నాయకులు గరికపాటి వెంకట కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

మృతురాలి తండ్రిని పరామర్శిస్తున్న మాజీ ఎంఎల్ఎ రమేష్‌బాబు

సిసి రోడ్డును ప్రారంభిస్తున్న ఎంపి, ఎంఎల్ఎ, నెట్టెం

సంక్షేమ పథకాల అమలే లక్ష్యం :ఎంపి

ప్రజాశక్తి - వత్సవాయి : సంక్షేమ పథకాలు అందించాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నట్లు ఎంపి కేశినేని శివనాథ్, కెడిసిసి బ్యాంకు ఉమ్మడి కృష్ణా జిల్లా చైర్మన్ నెట్టెం రఘురాం, స్థానిక ఎంఎల్ఎ శ్రీరామ్ రాజగోపాల్, మాజీ ఎమ్మెల్సీ సత్యనారాయణ రాజు అన్నారు. మండలం భీమవరం గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు ఇంటింటికి టిడిపి కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముందుగా గ్రామంలోని రూ.2 కోట్ల.81 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లు, డ్రైన్లను రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించారు. అనంతరం ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో వత్సవాయి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వడ్లమూడి రాంబాబు, టిడిపి గ్రామ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఎస్ఐ వెంకటేశ్వరరావుకు ఆత్మీయ వీడ్కోలు

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : జగ్గయ్యపేట పోలీస్ స్టేషన్ ఎస్ఐ 2గా పనిచేసి పదవీ విరమణ చేసిన బిఇ వెంకటేశ్వర రావు అభినందన వీడ్కోలు సభ ఆదివారం శ్రీరాం అమ్మాణీ కళాశాల ఆవర ణలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా తాతయ్య మాట్లాడుతూ ప్రజల కోసం వెంకటేశ్వరరావు నిస్వార్థంగా అంకితభావంతో నిజాయితీగా పనిచేశారని ఆయన సేవలు చిరస్మరణీయమని ప్రశంసించారు. జగ్గయ్యపేట సిఐ వెంకటేశ్వరరావు, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర మాట్లాడుతూ పనిచేసే అధికారులను గుర్తించటం, సత్కరించటం ప్రోత్సాహకరంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో యువనేత శ్రీరాం చినబాబు, నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు కన్నెబోయిన రామలక్ష్మి, సంకా వెంకట్రావు, జగ్గయ్యపేట ఎస్సై రాజు, ట్రాఫిక్ ఎస్ఐ శ్రీనివాస్ తదితరులు, వర్తక వాణిజ్య సంఘాల ప్రతినిధులు వెంకటేశ్వర దంపతులను ఘనంగా సత్కరించారు.

తొలి తెలుగు కవయిత్రి మొల్లమాంబ విగ్రహావిష్కరణ



ప్రజాశక్తి - విజయవాడ సిటీ : మొదటి మహిళా కవయిత్రి మొల్లమాంబ విగ్రహ ఆవిష్కరణ కుమ్మరిపాలెం సెంటర్లో ఘనంగా జరిగింది. ఏపీ కుమ్మర శాలివాహన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్సీ ఐలాపురం వెంకయ్య, శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ ఈశ్వర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తెలుగువారికి చదవడానికి వీలులేని రామాయణాన్ని సరళమైన భాషలో రచించిన కవయిత్రి మొల్ల అని మాజీ ఎమ్మెల్సీ ఐలాపురం వెంకయ్య తెలిపారు. 2017లోనే కేంద్ర ప్రభుత్వం పోస్టల్ స్టాంప్ ఆవిష్కరించి మొల్ల మాంబను గౌరవించిందని గుర్తు చేశారు. రాష్ట్రంలో అన్నిక జిల్లాలతో పాటు విజయవాడలో మొల్ల కాంస్య విగ్రహాన్ని ఏపీ కుమ్మరి శాలివాహన సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఐలాపురం వెంకయ్య ఎంతో కృషి చేశారని పేర్కొన్నారు. విజయవాడలో మొల్ల విగ్రహాన్ని ఏర్పాటు చేయడం ఎంతో గొప్ప విషయమని వక్తలు కొనియాడారు.

జీతాల సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసాద్

మాట్లాడుతున్న కెఎస్ఎస్ ప్రసాద్

ప్రజాశక్తి - విజయవాడ : బదిలీ అయిన ఉపాధ్యాయులు జీతాల సమస్య పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఎస్.ఎస్ ప్రసాద్ కోరారు. స్థానిక యుటిఎఫ్ జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సమావేశానికి జిల్లా అధ్యక్షులు కె.శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ 2024 - 2025 సంవత్సరాల్లో ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న నాలుగు కరువు భత్యాలు చెల్లించాలని కోరారు. 2021 నుండి ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న సరెండర్ లీవ్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి సుందరయ్య మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులు స్వేచ్ఛగా బోధన చేసేందుకు అవసరమైన వాతావరణాన్ని ప్రభుత్వం కల్పించాలని కోరారు. బోధనేతర పనులు నుండి, యాప్‌ల నుండి ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు ఉపాధ్యాయులు కట్టుబడి పని చేయాలని పేర్కొన్నారు. అధ్యక్షత వహించిన కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ విజయవాడ కార్పొరేషన్‌లో ఖాళీలు భర్తీ చేయుటకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్పొరేషన్‌లో ఎస్‌జిటిలకు తెలుగు ప్రమోషన్‌లు ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు ఎం.కృష్ణయ్య, జిల్లా సహాధ్యక్షురాలు పి.లీల, జిల్లా కోశాధికారి పి.నాగేశ్వరరావు, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ మహేశ్వర వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శులు కె.గంగరాజు, డి.హరి ప్రసాద్, బి.రెడ్ స్టార్, జె.సుధానంద్, కె.సంజీవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాపుల సంక్షేమానికి కృషి : అంజిబాబు



ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ప్రజా కాపు నాడు సంక్షేమ సంఘం సమావేశం విజయవాడలో ఆదివారం జరిగింది. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు యర్రంశెట్టి అంజిబాబు ముఖ్య అతిధిగా విచ్చేశారు. ప్రజా కాపునాడు సంక్షేమ సంఘం తూర్పు నియోజకవర్గం అధ్యక్షులుగా అమృతం లక్ష్మీకాంత్‌ను నియమించారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి, నియామక పత్రాన్ని అందజేశారు. అనంతరం యర్రంశెట్టి అంజిబాబు మాట్లాడుతూ తూర్పు నియోజకవర్గంలో కాపుల సంక్షేమం, అభివృద్ధికి నేటి నుంచి అమతం లక్ష్మీకాంత్ అందుబాటులో ఉంటారన్నారు. తూర్పు నియోజకవర్గంలో కాపు కళ్యాణమండపాన్ని ప్రభుత్వం వెంటనే నిర్మాణం చేయాలని కోరారు. పేద కాపు మహిళలకు పెళ్లి కానుక పథకాన్ని ప్రవేశపెట్టాలని కోరారు. అట్టడుగు స్థాయిలో కాపులున్నారని, వారి స్థితిగతులను తెలుసుకొని, వారికి రిజర్వేషన్ సౌకర్యం కూడా కల్పించాలని కోరారు. విజయవాడ తూర్పు నియోజకవర్గంలో కాపు కళ్యాణమండపాన్ని నిర్మించాలన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గణప రాము మాట్లాడుతూ తూర్పు నియోజకవర్గంలో అమృతం లక్ష్మీకాంత్‌ను నియమించడం పట్ల ఆనందం వ్యక్తం చేస్తున్నామని తెలిపారు. అమృతం లక్ష్మీకాంత్ మాట్లాడుతూ తూర్పు నియోజకవర్గంలో కాపులకు ఎటువంటి సమస్యలు ఉన్న వాటి పరిష్కారానికి కషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ నియోజకవర్గం ఇంచార్జి జస్వంత్ కుమార్, సెంట్రల్ నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలు విస్సంశెట్టి ఉష జ్యోతి, రాష్ట్రకార్యదర్శి పసుపులేటి రాజశేఖర్, తుమ్మల సాంబశివ రావు తదితరులు పాల్గొన్నారు.

కంచికచర్లలో వాహనాలు తనిఖీ

ప్రజాశక్తి - కంచికచర్ల : కంచికచర్లలో ఎస్సై రాజు సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ ముమ్మరంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై రాజు మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు వాహనానికి సంబంధించిన అన్ని రకాల పత్రాలు వెంట ఉంచుకోవాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని, రహదారి నియమాలు తప్పనిసరిగా పాటించాలన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. వాహనాలకు పత్రాలు లేకుంటే జరిమానా విధిస్తామన్నారు.

కంచికచర్ల లో వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్ఐ

కక్ష సాధింపులే కూటమి లక్ష్యం : నల్లగట్ల



మాట్లాడుతున్న నల్లగట్ల స్వామిదాస్

ప్రజాశక్తి - తిరువూరు : రాష్ట్రంలో విధ్వంసాలు, కక్ష సాధింపు చర్యలే లక్ష్యంగా కూటమి పరిపాలన కొనసాగుతుందని వైసిపి తిరువూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ నల్లగట్ల స్వామిదాసు ఆరోపించారు. తిరువూరులోని వైసిపి కార్యాలయంలో ఆదివారం ఆ పార్టీ మండల అధ్యక్షులు తాళ్లూరు నవీన్ కుమార్ అధ్యక్షతన మండల స్థాయి కార్యకర్తల, నాయకుల సమావేశం నిర్వహించి చంద్రబాబు ష్యూరిటీ, మోసం గ్యారంటీ కార్యక్రమంపై స్వామి దాసు దిశానిర్దేశం చేశారు. సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయటం సాధ్యం కాకపోవటం, దీనిపై ప్రజల్లో వస్తున్న వ్యతిరేకతను కప్పిపుచ్చేందుకు రాష్ట్రంలో వైసిపి నేతలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతూ రాజకీయ అలజడిని కూటమి ప్రభుత్వం సృష్టిస్తుందని స్వామిదాస్ మండిపడ్డారు. అధికారంలోకి రావాలని తప్పుడు హామీలిచ్చి ఆ తర్వాత మోసం చేయటమే చంద్రబాబు నైజమని పేర్కొన్నారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో కులం, మతం, రాజకీయాలు చూడకుండా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందితే కూటమి ప్రభుత్వం లో ఇచ్చిన హామీలను అమలు చేయకపోవ డమేకాకుండా పింఛన్లు, తల్లికి వందనం పథకా లలో భారీగా కోత విధించి అర్హులైన పేదలకు తీవ్ర అన్యాయం చేసిందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి యర్రమల రామచంద్రారెడ్డి, జిల్లా పరిషత్ మాజీ చైర్ పర్సన్ నలగట్ల సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

దూండీ గణేష్ మూల విరాట్ ప్రారంభం

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : విద్యాధరపురం, లేబర్ కాలనీ గ్రౌండ్స్‌లో డూండి గణేష సేవా సమితి ఆధ్వర్యంలో నిర్మిస్తున్న 72 అడుగుల భారీ గణనాథుని మూలవిరాట్‌ను ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పశ్చిమ ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్, ఏపీ ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండీ రాకేష్‌తో కలిసి పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. గణేష్ చతుర్థి పండుగ సందర్భంగా ప్రతి ఏటా విద్యాధరపురం, లేబర్ కాలనీ గ్రౌండ్స్‌లో డూండి గణేష సేవా సమితి ఆధ్వర్యంలో 72 అడుగుల భారీ గణనాథుని ప్రతిష్టించ నున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డూండి గణేష సేవా సమితి కమిటీ సభ్యులు కొత్త ముక్తేశ్వర రావు, దర్శి సుబ్బారావు, గడ్డం రవి, సామా చైతన్య కూటమి నేతలు వల్లభనేని లక్ష్మీ ప్రసన్న, నున్న కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కోనాయపాలెంలో తొలి అడుగు

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ, కోనాయపాలెం గ్రామంలో ఆదివారం 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య గ్రామ సర్పంచ్, కూటమి నాయకులు, టిడిపి నాయకులు మేకల సుధాకర్, వాసిరెడ్డి ప్రసాద్, గుత్తికొండ రాంబాబు, మార్కపుడి వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దుర్గగుడిలో యాత్రికుల రద్దీ

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : దుర్గమ్మను దర్శించుకునేందుకు యాత్రికులు ఇంద్రకీలాద్రికి ఆదివారం పెద్ద సంఖ్యలో విచ్చేశారు. ఆషాఢ సారె సమర్పణకు మహిళలు తరలి రావడంతో ఆదివారం ఉదయం 10 నుండి మధ్యాహ్నం 3 వరకు అన్ని దర్శనం క్యూలైన్లలో యాత్రికులను టికెట్ లేకుండా అనుమతించినట్లు ఆలయ ఇఒ శీనా నాయక్ తెలిపారు. టికెట్ అమ్మకాల ద్వారా వచ్చే ఆదాయం కన్నా యాత్రికుల సౌకర్యం, భద్రత ప్రధానంగా భావించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు శీనానాయక్ పేర్కొన్నారు. అంతరాలయ దర్శనం, విఐపి దర్శనం రద్దు చేసి సామాన్యులకే ప్రథమ ప్రాధాన్యత కల్పించామని, కేవలం వికలాంగులు, వృద్ధులు, చంటి బిడ్డల తల్లులు, నడవలేని స్థితిలో ఉన్న వారికి మాత్రమే లిఫ్ట్ ప్రవేశం కల్పించామన్నారు. ప్రధానమైన లిఫ్ట్ మార్గంలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లను, మహా మండపం ప్రతీ అంతస్తుకు అధికారులను నియమించి పర్యవేక్షణ చేయించిన ఫలితంగా మధ్యాహ్నం 3 గంటలకు 62,426 మందికి దర్శనం సజావుగా జరిగిందని ఈవో ప్రకటించారు. సాయంత్రం ఐదు గంటల సమయానికి 70 వేల మంది యాత్రికులు అమ్మవారిని దర్శించుకున్నారు.

స్మార్ట్‌మీటర్లతో విద్యుత్ రంగ ప్రైవేటీకరణకు కుట్ర

• మరో విద్యుత్ పోరాటానికి సిద్ధం కావాలి • ప్రజా వేదిక రాష్ట్ర నాయకులు చిగురుపాటి బాబురావు

మాట్లాడుతున్న సిహెచ్ బాబురావు

హాజరైన విద్యావంతులు, ప్రజావేదిక నాయకులు

ప్రజాశక్తి-గన్నవరం : స్మార్ట్ మీటర్లు పెట్టడం వెనుక విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరణ చేసే కుట్ర దాగి ఉందని, కరెంట్ బాదుడు పేరుతో జనం జేబులు కొట్టి అదాని జేబులు నింపే పనికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రీన్ సిగ్నల్ ఇచ్చాయని, ఈ దోపిడీ విధానానికి వ్యతిరేకంగా మరో విద్యుత్ ఉద్యమం చేపట్టాల్సిన అవసరం ఉందని, దానిలో ప్రజలను భాగస్వాములు చేయాలని ప్రజా వేదిక రాష్ట్ర నాయకులు చిగురుపాటి బాబురావు, సయ్యద్ అప్సర్ పిలుపునిచ్చారు. ఆదివారం గన్నవరం సుందరయ్య పార్క్ వద్ద ప్రజా వేదిక ఆధ్వర్యంలో స్మార్ట్ మీటర్లు వద్దు.. ట్రూ అప్ చార్జీలు రద్దు, విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా సదస్సు జరిగింది. దీనికి ప్రజా వేదిక నాయకులు మల్లంపల్లి ఆంజనేయులు, కాట్రగడ్డ జోషి అధ్యక్షత వహించారు. రాష్ట్ర నాయకులు (బాబురావు, అప్సర్) మాట్లాడుతూ.. విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరణ చేసి అదానీకి అప్పగించేందుకు పాలకులు ఒప్పందం కుదుర్చుకున్నట్లు చెప్పారు.అందులో భాగంగా అదానీ కంపెనీ కోటి స్మార్ట్ మీటర్లు తయారు చేస్తుందని, ముందుగా 46వేల మీటర్లు తయారుచేసి వ్యాపార దుకాణాలకు, కంపెనీలకు పెట్టి పని చేపట్టిందన్నారు. తర్వాత క్రమంగా ఇళ్లకు స్మార్ట్ మీటర్లు పెడతారన్నారు. ఇప్పటికే కరెంటు బాదుడు ఎక్కువైందని, తర్వాత స్మార్ట్ మీటర్ల బాదుడు వస్తుందన్నారు. రానున్న రోజుల్లో విద్యుత్ సరఫరా మొత్తం అదానీ చేతుల్లోకి వెళ్లిపోతుందని, ఆయన కాలాన్ని బట్టి, కరెంటు వినియోగాన్ని బట్టి యూనిట్ రేట్లు నిర్ణయించి వసూలు చేస్తాడని తెలిపారు. సగటున యూనిట్‌కు ఐదు రూపాయల నుంచి పది రూపాయల వరకు పెట్టి జనాన్ని బాదుడే బాదుడుకు గురిచేస్తారన్నారు. ఇందులో పెను ప్రమాదం ఏమంటే.. అదాని స్మార్ట్ మీటర్ మన ఇళ్లను స్కాన్ చేస్తుందని, ఆ తర్వాత గంటల లెక్కన కరెంటు బిల్లులు వేసే ప్రమాదం ఉందన్నారు. విచిత్రం ఏమంటే జగన్ అధికారంలో ఉండగా స్మార్ట్ మీటర్లు పెడుతుంటే వాటిని పగలకొట్టండి అన్న ఇప్పటి మంత్రి లోకేష్ స్మార్ట్ మీటర్లు పెట్టించే పనిలో ఉన్నారన్నారు. ఇప్పటి కూటమి నాయకులు పైన ప్రధాని మోడీ ఏం చెబితే అది చేస్తున్నారని విమర్శించారు. ఇప్పటికే కరెంటు బిల్లులు ఎన్ని రకాల అదనపు టాక్సు వస్తున్నాయో తెలియడం లేదని, ఇకపై స్మార్ట్ బాదుడు కూడా తోడైతే కరెంటు వాడలేని పరిస్థితి వస్తుందన్నారు. అదాని వ్యాపారమంతా ప్రజలకు ఎంతో అవసరమైన మంచినీరు, కరెంటు పైనే చేస్తున్నారని వివరించారు. దీనికి పాలకులు పూర్తిగా సహకరిస్తున్నారని విమర్శించారు. స్మార్ట్ మీటర్ల వల్ల కలిగే ప్రమాదాన్ని ప్రజలకు తెలియకుండా మాయమాటలు చెబుతున్నారని, విద్యావంతులు, మేధావులు, ప్రజావేదిక నాయకులు జనంలోకి వెళ్లి వాటి వల్ల కలిగే నష్టాలను అర్థమయ్యేలా చెప్పాలన్నారు. ఈ సమావేశంలో ప్రజావేదిక నాయకులు గన్నే వెంకట్రావు, అనుమోలు వెంకటేశ్వరరావు, గొంది శోభనం, బుద్ధవరం సర్పంచి బడుగు బాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉయ్యూరు పిఎసిఎస్ పాలకమండలి ప్రమాణస్వీకారం

ప్రజాశక్తి-ఉయ్యూరు : పార్టీ కోసం అహర్నిశలు కష్టంచే కార్యకర్తలకు సముచిత స్థానాన్ని అందించే పార్టీ తెలుగుదేశం పార్టీ అని ఆ పార్టీ ఉపాధ్యక్షులు వైవీ రాజేంద్రప్రసాద్ అన్నారు. ఉయ్యూరు పిఎసిఎస్ అధ్యక్షుడుగా కూనపురెడ్డి వాసుతో పాటు నూతన పాలక మండలి ప్రమాణ స్వీకారం ఆదివారం స్థానికంగా ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని నూతన పాలకమండలిలో ఉన్న ప్రతి ఒక్కరూ పార్టీ అధికారంలో ఉన్నా లేకున్నా అండగా నిలబడ్డారని ఎన్నో కష్టాలను ఎదుర్కొన్నారని తెలిపారు. పెనమలూరు శాసనసభ్యులు బోడె ప్రసాద్ మాట్లాడుతూ రైతు శ్రేయస్సును దష్టిలో ఉంచుకొని నూతన పాలకవర్గం పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ పూర్ణచంద్రరావు, పట్టణ పార్టీ అధ్యక్షులు గుర్నాథరావు, టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో 'మీకోసం'

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : కలెక్టరేట్ సమావేశ హాలులో సోమవారం ఉదయం 10:30 గంటల నుండి ప్రజా సమస్యల పరిష్కార వేదిక –మీకోసం (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం నిర్వహించి ప్రజల నుండి అర్జీలు స్వీకరిస్తామని జిల్లా రెవెన్యూ అధికారి కె. చంద్రశేఖర రావు.ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని డివిజన్, మండల కేంద్రాల్లో, మునిసిపల్ కార్యాలయాల్లో కూడా మీకోసం కార్యక్రమం జరుగుతుందని డిఆర్ఓ వివరించారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని మండల కార్యాలయాలు లేదా మున్సిపల్ కార్యాలయాలలో కూడా అందజేయవచ్చన్నారు.

కొండలమ్మను దర్శించుకున్న యాత్రికులు

కొండలమ్మను దర్శించుకున్న యాత్రికులు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండలంలోని వేమవరం గ్రామంలో ఉన్న శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థానంలో ఆషాడ మాసం,ఆదివారం సంధర్భంగా అధిక సంఖ్యలో యాత్రికులు అమ్మవారిని దర్శనం చేసుకున్నారు. సుమారు 20 వేల పైగా యాత్రికులు అమ్మవారిని దర్శించుకున్నారు. అత్యధిక సంఖ్యలో అమ్మవారికి పాలపొంగళ్ళు సమర్పించి, వారి మొక్కుబడులు తీర్చుకున్నారు. దర్శనానికి విచ్చేసిన యాత్రికులకు తాగునీరు, శానిటేషన్ ఏర్పాట్లు, ఏ విధమైన అసౌకర్యములు కలగకుండా దర్శనం చేసుకొనుటకు దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఆకుల కొండలరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఆలయం వద్ద ఏ విధమైన అసౌకర్యములు, అవాంఛనీయ, సంఘటనలు కలగకుండా గుడ్లవల్లేరు ఎస్సై ఎన్ వివి సత్య నారాయణ వారి సిబ్బంది బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

శాకంబరీగా అలంకారం

ప్రజాశక్తి-మోపిదేవి : మండలంలోని శ్రీవల్లి దేవసేనా సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవాలయంలో అమ్మవారిని శాకంబరిగా అలంకారం చేశారు. టన్నుల కొద్ది కూరగాయలతో మహా ద్వారం దగ్గర నుంచి ధ్వజస్తంభం భక్తుల క్యూ లైన్లు గర్భాలయంలో ఉత్సవ మూర్తుల విగ్రహాలకు సర్వాంగ సుందరంగా వివిధ ఫలపుష్ప కూరగాయలతో అర్చకులు అలంకరించారు. దేవస్థానం కమిషనర్ ఆలయ కార్య నిర్వహణ అధికారి వేలాదిగా తరలివచ్చిన భక్తులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించారు. దాదాపు అరవైవేల మందికి అన్నదానం చేశారు. కోడూరు కు చెందిన స్వతంత్ర పరం భక్త సమాజం సభ్యులు దేవస్థానం ప్రాంగణంలో వాలం టీర్లుగా సేవలందించారు. 108 కళాశాలతో ప్రత్యేక అభిషేకాలు, ఏకాదశ రుద్రాభిషేకాలు భక్తజన సందోహం నడుమ ప్రధాన అర్చకులు బుద్ధ పవన్ కుమార్ శర్మ, ఇతర అర్చక బృందం ఘనంగా నిర్వహించింది.

రక్తదాన శిబిరం ప్రారంభం

ప్రజాశక్తి-కోడూరు : లెజెండ్స్ సోషల్ సర్వీసెస్ సంస్థాను స్థాపించి 23 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కోడూరు లోని శ్రీ వెంకట రామకృష్ణ థియేటర్ ప్రాంగణంలో ఆదివారం జిల్లా ప్రభుత్వ హాస్పిటల్ బ్లడ్ బ్యాంక్ మచిలీపట్నం వారి సహకారంతో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని కోడూరు మండలం ఫెర్టిలైజర్స్ అండ్ పెస్టిసైజ్ యూనియన్ అధ్యక్షులు పూతబోయిన రామారావు ప్రారంభించారు. మచిలీపట్నం బ్లడ్ బ్యాంక్ వైద్యులు పావని పర్యవేక్షణలో రక్తదాన శిబిరాన్ని కొనసాగింది. ఈ సందర్భంగా లెజెండ్స్ సోషల్ సర్వీసెస్ టీమ్ సభ్యులు మాట్లాడుతూ మా టీమ్ వ్యవస్థాపక అధ్యక్షులు పూతబోయిన అయ్యప్ప స్వామి సూచనలతో ఈ రక్తదాన శిబిరాన్ని నిర్వహించామని, మొత్తం 38 మంది ఈ శిబిరంలో పాల్గొని రక్తదానం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ సూపర్వైజర్ బాలరాజ్, బ్లడ్ బ్యాంక్ సిబ్బంది, లెజెండ్స్ సోషల్ సర్వీసెస్ టీమ్ సభ్యులు బడే నాని, బండే జయ కిషోర్ పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం ప్రారంభిస్తున్న దృశ్యం

పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

ఉచిత వైద్య శిబిరం విజయవంతం

ప్రజాశక్తి - గుడివాడ : పామర్రు రోడ్డులోని ఆర్‌సియం చర్చి ఎదురు ప్రభావతి గార్డెన్స్‌లో ఆదివారం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంపు విజయవంతం అయిందని రోటరీ అధ్యక్షులు ఎలమంచిలి నాగేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెల మొదటి, మూడో ఆదివారాల్లో త్రిపిరనేని లక్ష్మీ పెరుమాళ్ళు వారి భార్య చలసాని రాయన్‌చౌదరి జ్ఞాపకార్థం జరిగే ఈ క్యాంపులో సిద్ధార్థ మెడికల్ కాలేజీ హాస్పిటల్ వారి సౌజన్యంతో గుండె, నరములు వ్యాధులపై ఈసీజీ జరిపి ఉచితంగా మందులు పంపిణీ చేశారన్నారు. ఈ కార్యక్రమానికి కన్వీనర్లుగా డాక్టర్ సి సూర్యచంద్రరావు, గొల్లపల్లి కిరణ్ బాబు వ్యవహరించగా, అసిస్టెంట్ గవర్నర్ కేబిజీకే శ్రీనివాస్, ఏజే ప్రసాద్, సుబ్రహ్మణ్యేశ్వర రావు, ఏఎస్‌వివిఎన్ మారుతి కుమార్ పాల్గొన్నారు. డాక్టర్ రమణి రెడ్డి, డాక్టర్ తరుణ్ కుమార్ రెడ్డి, డాక్టర్ వి సాత్విక నరసింహారావు, డాక్టర్ వి కొల్లి నిహారిలు వైద్య సేవలు అందించారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-కంకిపాడు : మండలంలోని ఈడుపుగల్లుకు చెందిన పుప్పాల పూజిత ఉన్నత విద్యాభ్యాసానికి కంకిపాడు తెలుగు యువత యువ నాయకుడు యలమంచిలి భార్గవ రామ్ (బాబీ) అందించిన పదివేల రూపాయల ఆర్థిక సాయంను పెనమలూరు శాసనసభ్యులు బోడె ప్రసాద్ ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రవేశపెట్టిన పీ4 కార్యక్రమంలో ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలని, తోటి వారికి సాయం చేయడానికి ముందుకు రావాలని పిలుపిచ్చారు.



గుర్రపుడెక్క తొలగిస్తున్న దృశ్యం

గుర్రపు డెక్క తొలగింపు

ప్రజాశక్తి-చల్లపల్లి : అవనిగడ్డ శాసనమండలి సభ్యులు మండలి బుద్ధప్రసాద్ ఆదేశాలతో యుద్ధ ప్రాతిపదికన గుర్రపుడెక్క తొలగింపు చేపట్టినట్లు చల్లపల్లి డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ నిడమానూరు దిలీప్ కుమార్ తెలిపారు. ఆదివారం చల్లపల్లి మండలం కొత్తమాజేరులో గుండేరు మేజర్ డ్రైనేజీలో గుర్రపు డెక్క తొలగింపు పనులను దిలీప్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన పంట కాలువల సర్ ప్లస్ ఎస్కేప్ ల వద్ద నుంచి వచ్చిన నీటి ప్రవాహ వేగానికి గుండేరు ఎగువ నుంచి, ఏనుగుల కోడు నుంచి మాజేరు డ్రైనేజీపై వంతెన వద్దకు భారీగా గుర్రపు డెక్క కొట్టుకువచ్చి దట్టంగా పేరుకుపోయిందని తెలిపారు. రైతులు, గ్రామస్థులు ఈ సమస్యను మండలి బుద్ధప్రసాద్ దష్టికి తీసుకెళ్లగా, ఆయన ఆదేశాలతో యుద్ధప్రాతిపదికన ప్రొక్లయిన్ ఏర్పాటు చేసి గుర్రపు డెక్క తొలగింపు పనులు చేపట్టినట్లు తెలిపారుదీంతో పాటు ఘంటసాల మండలం బిరుదుగడ్డ, దేవరకోట, దాలిపర్రు పరిధిలో కూడా గుండేరు డ్రైనేజీలో గుర్రపు డెక్క తొలగింపు పనులు జరుగుతున్నట్లు వివరించారు. వైస్ ఎంపీపీ మోర్ల రాంబాబు, తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షులు మోర్ల శివ పాల్గొన్నారు. డీసీ చైర్మన్ దిలీప్, డీసీ వైస్ చైర్మన్ పరిశే చలపతిరావు, జనసేన నాయకులు బండి నాగార్జున పనులు పర్యవేక్షించారు.

అన్ని వార్డులకూ సమానంగా నిధులివ్వాలి

ప్రజాశక్తి - తిరువూరు : ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాస రావు తిరువూరు నగర పంచా యతీలో వార్డుకు రూ.10 లక్షలు చొప్పున ఇస్తానన్న అభివృద్ధి నిధులు 20 వార్డులకు సమానంగా ఇవ్వాలని సిపిఎం తిరువూరు పట్టణ కమిటీ కార్యదర్శి మేకల నాగేంద్రప్రసాద్ విజ్ఞప్తి చేశారు. కమిటీ సమావేశం ఆదివారం తిరువూరు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగింది. టిడిపికి సంబంధించిన కౌన్సిలర్ల వార్డులకే కాకుండా ప్రతిపక్ష కౌన్సిలర్లు ఉన్న వార్డులు కూడా నిధులు మంజూరు చేసి అభివృద్ధి జరిగేలా చూడాలన్నారు. వర్షాకాలం ప్రారంభవడంతో పారిశుధ్యం లోపంచకుండా దోమలు వ్యాప్తి చెందకుండా అన్ని వార్డుల్లో పరిశుభ్ర కార్యక్రమాలు నిర్వహించాలని ఆయన పేర్కొన్నారు. సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెంద కుండా మురుగు కాలువలను పూడిక తీయించ డం, దోమలు మందు పిచికారి చేయించి ప్రజా ఆరోగ్యాన్ని కాపాడాలని నగర పంచాయతీ పాలకవర్గాన్ని నాగేంద్రప్రసాద్ కోరారు. పట్టణం లో సుమారు 500 వీధిలైట్లు వెలగటం లేదని వెంటనే లైట్లు వేయించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఆ పార్టీ నాయకులు పంతంగి శ్రీనివాసరావు, ఆకుల రవి, షేక్ నాగుల మీరా పాల్గొన్నారు.

ఆటో వర్కర్లకు యూనిఫాం అందజేత

ప్రజాశక్తి - వత్సవాయి : డబ్బాకుపల్లి, పెంటలవారిగూడెం, పోలంపల్లి గ్రామంలో గ్రామానికి చెందిన ఆటో వర్కర్స్‌కు పోలంపల్లి టిడిపి యువ నాయకుడు - దారెల్లి చిరంజీవి చేతుల మీదుగా ఖాకీ యూనిఫామ్ అందజేశారు. ఈ సందర్భంగా చిరంజీవి మీడియాతో మాట్లాడుతూ డ్రైవర్లందరూ డ్రైవింగ్‌లో మైండ్ సెట్‌తో డ్రైవ్ చేయాలన్నారు. ఆటోలోని ప్రయాణికులకు ఇబ్బందికరంగా ఉండకూడదని సూచించారు.

సిపిఐ నియోజకవర్గ కార్యదర్శిగా సుబ్బారావు

ప్రజాశక్తి - నందిగామ : సిపిఐ నందిగామ నియోజకవర్గ కార్యదర్శిగా చుండూరు సుబ్బారావు సహాయ కార్యదర్శులుగా కట్ట చామంతి, షేక్ గులామ్ మొహమ్మద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ నియోజకవర్గం కోనాయపాలెం గ్రామంలో శ్రీ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరం ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య గ్రామ సర్పంచ్, కూటమి నేతలతో కలిసి శుభారంభం చేశారు. సత్యసాయి సేవా సమితి కన్వీనర్ ఉప్పుటూరి వాసుదేవరావు, టిడిపి నాయకులు వాసిరెడ్డి ప్రసాద్, గుత్తికొండ రాంబాబు పాల్గొన్నారు.

వైద్య శిబిరం ప్రారంభిస్తున్న సౌమ్య

పేట నియోజకవర్గ అభివృద్ధికి నిధులు : ఎంఎల్‌ఎ

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : పట్టణంలోని స్థానిక ఎంఎల్‌ఎ శ్రీరామ్ రాజగోపాల్ నివాసంలో ఆదివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా స్థానిక ఎంఎల్‌ఎ శ్రీరాం రాజగోపాల్ తాతయ్య మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి కంటే రైతు అభివృద్ధే అసలైన అభివృద్ధి అని ఆయన స్పష్టం చేశారు. ముక్త్యాల లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌కు రూ.489.28 కోట్లు మంజూరు, జీవో నెంబర్ 44 ప్రకారం నిధుల విడుదల, 38,627 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించే ప్రాజెక్టు, వేదాద్రి వద్ద నుండి 386.27 క్యూసెక్కుల నీటిని రెండు దశల్లో ఎత్తి, డీవీఆర్ కాలువ ద్వారా మూడు స్థలాల్లో నీటి విడుదలతో జగ్గయ్యపేట, వత్సవాయి, పెనుగంచిప్రోలు మండలాల్లో 30 గ్రామాలకు పైగా లబ్ధి చేకూరనుందని తెలిపారు. జగ్గయ్యపేట పట్టణంలోని ఎర్రకాలువ లైనింగ్ పనులకు రూ.5.65 కోట్లు మంజూరు, శాంతినగర్ నుండి చెరువు వరకు లైనింగ్ పనులు, కల్వర్టు ఏర్పాటు ద్వారా కాలనీల్లో ఇబ్బందుల నివారణ చేయవచ్చన్నారు. రైతులు ప్రతి సీజన్ నీటి కోసం ఎదురుచూసే పరిస్థితి తొలగిపోతుందన్నారు. ఎన్‌ఎస్‌పి ఆయకట్టులో ఉన్న సాగుభూములకు స్థిరంగా సాగునీరందుతుందని,

వ్యవసాయంలో స్థిరత, ఆదాయం పెంపు, భవిష్యత్తు తరాలకు నీటి భద్రత ఇది కలిగించబోతోందని అన్నారు. శాంతినగర్ నుండి జగ్గయ్యపేట చెరువు వరకు ఉన్న ఎర్రకాలువకు లైనింగ్, కల్వర్టు నిర్మించడం ద్వారా వర్షాకాలంలో నీటి నిల్వ, మురుగు ప్రవాహాల సమస్యలు తొలగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర రంగాపురం, మండల పార్టీ అధ్యక్షులు కట్టా నరసింహారావు, నీటి సంఘాల నాయకులు ఏలూరు గోపాలరావు, చిట్టూరి సుభాష్, కౌన్సిలర్లు కన్నెబోయిన రామలక్ష్మి, పేరం సైదేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమిత ప్రభుత్వ భూమిని కాపాడాలని విజ్ఞప్తి

నందిగామలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమి

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ పట్టణ శివారు రమణ కాలనీ ఎదురుగా ప్రభుత్వ భూమి అక్రమ గురవుతుందని నందిగామ ప్రాంతానికి చెందిన బండారు శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం పత్రిక ప్రకటన ద్వారా తెలుపుతూ డివిఆర్ కాలనీ వద్ద సర్వే నెం.793లో సూర్యదేవర పుర్ణయ్య, ఆక్రమించుకని ప్రహరీ గోడ నిర్మించుకున్నారు. ఈ విషయం రెవెన్యూ డివిజినల్ అధికారికి 6830: ఏటీఆర్ 202 305 19373. 19.05.2023 ఫిర్యాదు చేశారు. దరిమిల పూర్ణయ్యను ఎమ్మార్వో కార్యాలయం పిలిసి అధికారులు విచారించారని, అది ప్రభుత్వ భూమి (పుంత) అని తెలియక కట్టుకున్నారు. దీనిపై ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకున్న తనకు అభ్యంతరం లేదని ఎమ్మార్వోకు స్టేట్మెంట్ ఇచ్చినట్లు తెలిపారు. తహశీల్దార్ నందిగామ పురపాలక సంఘం కమిషనర్‌కు ఆక్రమించుకున్న స్థలాన్ని, గోడని తీసివేసి ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని తెలిపారు. కమిషనర్ రెండు సంవత్సరాలు ఎలాంటి చర్యలు తీసుకోకవడం తాము పలుమార్లు కమిషనర్ సంప్రదించగా బిజీగా ఉన్నామని, తర్వాత చూద్దామని దాటవేస్తున్నారని, దీనికి సంబంధించిన కాపీలను జతపరుస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికైనా మున్సిపల్ కమిషనర్ పట్టించుకుని ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని బండారు శ్రీనివాస్ కోరారు.

నాశి రకంగా ఊర చెరువు పనులు

- ♦అల్ట్రా టెక్ సొమ్ముతోనే పూర్తి చేసినట్లు వాదనలు
- ♦నాణ్యతా లోపంతో స్థానికుల అవస్థలు

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : పట్టణ మధ్యలో ఉన్న ఊర చెరువు సుమారు 304 ఎకరాల ఆయకట్టు సాగవుతుంది. చెరువులో నీటి నిల్వ వల్ల పట్టణ భూగర్భ జలాలు సామర్థ్యం సైతం పెరుగుతుంది. పట్టణ ప్రజా శ్రేయస్సు దృష్టిలో పెట్టుకొని ఊర చెరువు చుట్టూ ఉన్న గట్టును పటిష్ట పరచటం, గోడ, లైటింగ్, చెట్లు పెంచడం, కల్వర్టుల నిర్మాణ పనులు చేసేందుకు జగ్గయ్యపేట పురపాలక సంఘం వారు సంబంగి శ్రీనివాసరావుకు టెండర్ ద్వారా కేటాయించడం జరిగినట్లు తెలుస్తోంది. ఈ నిర్మాణంలో అల్ట్రా టెక్ సిమెంట్ కర్మాగారం యాజమాన్యం వారు సుమారు ఒక్క కోటి రూపాయలు నగదును పనులకు అందించినట్లు తెలుస్తుంది. డిస్ట్రిక్ మైన్స్ ఫౌండేషన్ ట్రస్టు (డి ఎంఎఫ్‌టి) నుండి రూ.2 కోట్లు ఈ టెండర్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరింగ్ (పిహెచ్) విజయవాడ ద్వారా సుమారు రూ.35 లక్షలు, యస్.యఫ్.టి ద్వారా మొత్తంగా సుమారు రూ.5 కోట్ల పనులను టెండర్ దారునికి అప్పగించినట్లు సమాచారం. కానీ వాస్తవాలను పరిశీలిస్తే టెండర్ దారుడు చేసిన ఒప్పంద పనులలో నాశి రకం,



అసంపూర్తిగా, అవగాహన లేకుండా పనులను పూర్తి చేసారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనితో ఊర చెరువును ఆనుకొని నివసిస్తున్న ప్రజలు చిన్న వానకు సైతం గోడ వెంబడి నీరు నిల్వ ఉండటం, పూర్తి స్థాయిలో చెరువులో నిర్మించిన గట్టుకి అంచుల వల్ల అటు ప్రజలు, ఇటు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సుమారు 1 కోటికి నగదుకు రూ.50 లక్షల రూపాయల ఖర్చుతో నాశి రకం పనులను పూర్తి చేసారనే వాదనలు వినిపిస్తున్నాయి.

కంచే చేను మేసినట్లు

సిపిఐ పట్టణ కార్యదర్శి జూనెబోయిన శ్రీనివాసరావు మాట్లాడుతూ కంచే చేను మేసినట్లుగా ప్రభుత్వం ప్రజల సొమ్ము అభివృద్ధి పేరుతో జగ్గయ్యపేట మున్సిపాలిటీ పాలక మండలి అధికారులు అప్పనంగా టెండర్ దారునికి రాజమార్గం పేరుతో రెడ్ కార్పేట్ పరచి దోచిపెడుతున్నారని ఆరోపించారు. దీని పై ప్రభుత్వం న్యాయ విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

కూటమి మోసాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ప్రజాశక్తి - వత్సవాయి : దగా మోసం చేయటంలో 40 సంవత్సరాలు అనుభవం వ్యక్తి చంద్రబాబు నాయుడు అని జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్చార్జి తన్నీరు నాగేశ్వరావు విమర్శించారు. మండల కేంద్రమైన వత్సవాయిలో వాసవి కళ్యాణ మండపంలో మండల పార్టీ అధ్యక్షుడు గుత్తా శంకర్రావు ఆధ్వర్యంలో బాబు షూరిటీ - మోసం గ్యారంటీ రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో గుర్తుకు తెస్తూ నిర్వహించారు. మండల శ్రేణులతో కలిసి ఇంటింటా చంద్రబాబు అండ్ కో మోసాలను ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. ముందుగా డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం క్యూఆర్ కోడ్ స్కానర్ ఆవిష్కరించి స్కానర్ ద్వారా ప్రజలకు ఎలా వివరించాలో మండలంలో ప్రతి గ్రామాలకు తీసుకువెళ్లి ప్రజలకు తెలియజేయాలన్నారు.

దుర్గమ్మకు ఆషాఢ సారె

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : ఇంద్రకీలాద్రిపై ఉన్న దుర్గమ్మకు భవానీపురం ప్రియదర్శినీ కాలనీ వాసులు ఆషాఢ సారె సమర్పించారు. పూలు, పండ్లు, గాజులు పసుపు కుంకుమ చీర సారె పలు రకాల మధుర పదార్థాలను సమర్పించి, ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు.

విరాళం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : మండలంలోని తిరుమలగిరి గ్రామంలో గల శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో జరుగుతున్న నిత్యాన్నదాన పథకానికి తెలంగాణ రాష్ట్రం కోదాడ మండలం నల్లబండగూడెం గ్రామానికి చెందిన చిగురుపాటి సుధాకర్, కళ్యాణి రూ.10,116 లు విరాళంగా అందజేశారు. దాతలకు ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం ఆలయ సిబ్బంది ప్రసాదం, శేష వస్త్రం అందజేసినట్లు ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వాణాధికారి తెలిపారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : మండలంలోని చిల్లకల్లు విద్యుత్ సబ్‌స్టేషన్ ఆటోనగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని షేర్ మహమ్మద్ పేట, ఆటోనగర్ ఏరియాలలో సోమవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా షేర్ మహమ్మద్ పేట గ్రామంలో ఆర్డీఎస్ కొత్త లైన్, కొత్త ట్రాన్స్ఫార్మర్ పనులు ఏర్పాటు చేసేందుకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు మండల విద్యుత్ శాఖ ఏఈ కె రమేష్ బాబు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

పాఠశాలకు వాటర్ డ్రమ్ము అందజేత

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ న్యూ కాలనీ పాఠశాలకు వాటర్ డ్రమ్మును నందిగామ వాస్తవ్యులు జనరల్ స్టోర్ అధినేత సముద్రాల సీతారాం అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల సిబ్బంది వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎ.శ్రీనివాసరావు, షేక్ ఖాజా, చంద్రిక, పుష్పవతి ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
జిల్లా వార్తలు 7
సోమవారం 21 జూలై 2025

రామకృష్ణ నాట్యమండలి స్వర్ణోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్ : పౌరాణిక నాటక రంగంలో పనిచేస్తున్న రామకృష్ణ నాట్యమండలి సంస్థ 50 వసంతాలు పూర్తి చేసుకోవడం అపూర్వమైన విషయమని మచిలీపట్నం మున్సిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్ అన్నారు. ఆదివారం బొచ్చుపేట ఆంజనేయస్వామి గుడి దేవాలయంలో మహతి కళావేదికలో జరిగిన రామకష్ణ నాట్యమండలి వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. దశాబ్దాల తరబడి మన సంస్కృతిని పరిరక్షిస్తున్న గొప్ప కళాకారుడు సంస్థ నిర్వాహకులు జగన్మోహన్రావు సేవలను అభినందించారు. ప్రముఖ న్యాయవాది సాహితీ మిత్రుల సంస్థ అధ్యక్షులు , ప్రముఖ న్యాయవాది లంకిశెట్టి బాలాజీ మాట్లాడుతూ మచిలీపట్నంలో పుట్టిన సంస్థ విశ్వవ్యాప్తంగా గుర్తింపు పొంగటం బందరు ప్రజలకు

పురస్కారాలు అందిస్తున్న దృశ్యం

గర్వకారణం అన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్, మచిలీపట్నం ఆర్టీసీ డిపో మేనేజర్ టి.పెద్దిరాజు, ప్రముఖ వైద్యులు డాక్టర్ ధన్వంతరి ఆచార్య, నాట్య మండలి నిర్వాహకులు జొన్నలగడ్డ జగన్మోహన్రావు, నాట్యమండలి కార్యదర్శి జొన్నలగడ్డ శ్రవణ్ కుమార్ , మచిలీపట్నం రంగస్థలం కళాకారుల సంక్షేమ సంఘ అధ్యక్షులు వేముల సూరిబాబు, సామాజిక కార్యకర్త పివి ఫణికుమార్ పాల్గొన్నారు. మండలి 50 వసంతాల వేడుక సందర్భంగా ఐదుగురికి విశిష్ట కళా సేవక్ పురస్కారాలను బహుకరించి సత్కరించారు. వ్యక్తిత్వ వికాస నిపుణులు డాక్టర్ విడియాల చక్రవర్తి కి జంధ్యాల రాధాకష్ణ స్మారక పురస్కారం,ప్రముఖ హార్మోనిస్టు కె. పరబ్రహ్మాచారికి గుత్తికొండ కోటేశ్వరరావు స్మారక పురస్కారం, విష్ణుభట్ల సూర్యనారాయణ శర్మ ఘనాపాటికి ఆధ్యాత్మికవేత్త జొన్నలగడ్డ సుబ్రహ్మణ్య శాస్త్రి స్మారక పురస్కారం, ప్రముఖ గాయని వై. రాధికా సుబ్రహ్మణ్యం కు అయినంపూడి వెంకటేశ్వరరావు స్మారక పురస్కారం, ప్రముఖ రంగస్థలం నటులు పుప్పాల వీరాంజనేయులు కు డి.వి. సుబ్బారావు స్మారక పురస్కారం బహుకరించి సత్కరించారు. నాట్యమండలి వార్షికోత్సవాలను పురస్కరించుకుని మండలి అధినేత జగన్మోహన్రావు 20 మంది కళాకారులకు ఆర్థిక సహకారం అందించారు

కరపత్రాలు అందిస్తున్న కేంద్ర మంత్రి పెమ్మసాని

సుపరిపాలన కరపత్రాలు పంపిణీ

ప్రజాశక్తి-కంకిపాడు : కంకిపాడు మండలంలోని గొడవర్రు గ్రామంలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌తో కలిసి కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఆదివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుపరిపాలన కరపత్రాలు అందించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ఈ సంవత్సర కాలంలోనే గొడవర్రు గ్రామంలోనే సుమారు నాలుగు కోట్ల పైనే అభివృద్ధి కార్యక్రమాలు చేశామని, అభివద్ధితో పాటు సంక్షేమం కూడా చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో తాడిగడప మున్సిపాలిటీ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు అనుమోలు ప్రభాకర్, కంకిపాడు మాజీ ఎంపీపీ దేవినేని రాజా, సీనియర్ నాయకులు తుమ్మలపల్లి హరికష్ణ, కూటమి నాయకులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-అవనిగడ్డ :** మండల పరిధిలోని దక్షిణ చిరువోలులంక తదితర గ్రామాలలో సుపరిపాలన ముందడుగు కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు యాసం చిట్టిబాబు ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుంటూ ప్రభుత్వం ద్వారా అమలవుతున్న సంక్షేమ కార్యక్రమాలు అందరికీ అందుతున్నాయో లేదో అడిగి తెలుసుకున్నారు. డిసి వైస్ చైర్మన్ బచ్చు రఘునాథ ప్రసాద్, రాష్ట్ర రైతు సంఘం నాయకులు పుల్లగూర రాజేంద్రప్రసాద్, గుడివాక శివరావు చందన నరసింహా రావు, అన్నపరెడ్డి లక్ష్మీనారాయణ, అన్నపరెడ్డి రామదాసులింగం, బాబురావు పాల్గొన్నారు.

పనులు పరిశీలిస్తున్న ఎంఎల్ఎ వర్ల కుమార్ రాజా

డ్రైనేజీ సమస్య పరిష్కారానికి చర్యలు : ఎంఎల్ఎ

ప్రజాశక్తి - పామర్రు : డ్రైనేజీ వ్యవస్థలో దీర్ఘకాలిక సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే విధంగా తగిన చర్యలు తీసుకుంటున్నామని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. ఆదివారం స్థానిక బాపూజీ పేట నుండి జాతీయ రహదారి 65 వరకు గల డ్రైనేజీ పూడికతీత పనులను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మురుగు సమస్యల పరిష్కారంకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పామర్రు టౌన్ లో ఎక్కడ మురుగు ఉన్నా, ఇళ్ల ముందు చెత్త ఉన్నా, ప్రతిరోజు శానిటేషన్ సిబ్బంది పర్యవేక్షించే విధంగా తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పామర్రు పంచాయతీ వార్డు సభ్యుడు మంతెన రామాంజనేయులు, పట్టణ టిడిపి అధ్యక్షుడు పరసా సుబ్రహ్మణ్యం, జిల్లా టిడిపి సహాయ కార్యదర్శి చాట్ల పెద రమేష్, పాల్గొన్నారు.

జనసేనలో చేరిక

ప్రజాశక్తి - గుడివాడ : స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో పార్టీ ఇన్‌చార్జి బూరగడ్డ శ్రీకాంత్ సమక్షంలో గుడివాడ పట్టణానికి చెందిన లోయ రాజా ఆధ్వర్యంలో సుమారు 50 మంది జనసేన పార్టీలో చేరారు. పట్టణ అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి సాయిన రాజేష్, సభ్యులు సుంకర వెంకట్, షేక్ మీరాషరీఫ్ పాల్గొన్నారు.

కూటమి నాయకుల కుట్రలను ఎదుర్కొంటాం : కైలే

ప్రజాశక్తి-తోట్లవల్లూరు : వైసిపి శ్రేణులంతా కలసికట్టుగా కూటమి నాయకుల కుట్రలను ఎదుర్కో వాలని పామర్రు నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు కైలే అనిల్‌కుమార్ అన్నారు. ఆదివారం భద్రరాజుపాలెం గ్రామంలో వైయస్సార్ పార్టీ మండల విస్తత స్థాయి సమావేశం నిర్వహించారు. సర్పంచి కొక్కిలిగడ్డ హేమలత అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని తొలత గ్రామంలో ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం కళ్యాణ మండపంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో టిడిపి మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిందని, టిడిపి ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి

వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేస్తున్న కైలే అనిల్‌కుమార్

తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఒక్క వైసీపీ కార్యకర్తపై ఉందని ఆయన అన్నారు. రానున్న రోజుల్లో ప్రతి ఒక్క వైసీపీ కార్యకర్త సైనికులలా పనిచేసి టిడిపి, కూటమి ప్రభుత్వాలకు వ్యతిరేకంగా పోరాడాలని ఆయన అన్నారు. జడ్పిటిసి జొన్నల రామ్మోహన్ రెడ్డి, ఎంపీపీ ఈడుపుగంటి రాజామణి, నడకుదురు రాజేంద్ర అన్ని గ్రామాల వైసీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మండలి కుటుంబంపై వ్యాఖ్యలకు ఖండన

ప్రజాశక్తి-అవనిగడ్డ : మండలి కుటుంబం గురించి మాట్లాడే అర్హత వైసిపి వాళ్లకు లేదని ఏఎంసీ చైర్మన్ కొల్లూరు వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం సాయంత్రం అవనిగడ్డ లోని ఎమ్మెల్యే కార్యాలయంలో కూటమి నాయకులు మీడియాతో మాట్లాడుతూ వైసీపీ నేతల విమర్శలను ఖండించారు. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్ వెంకటేశ్వర మాట్లాడుతూ నియోజక వర్గంలో ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వంలో కోట్ల రూపాయలతో చేసిన అభివద్ధి సంక్షేమ కార్యక్రమాలు సమగ్ర నివేదిక ఒకసారి చదువుకోవాలని సూచించారు. ఈ స్థాయిలో నిధులు సాధించడం బుద్ధ ప్రసాద్ కే సాధ్యమైంది అన్నారు. వైసిపి ఐదేళ్ల పాలనలో కోడూరు-అవనిగడ్డ రోడ్డు ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. ఓటమి ప్రభుత్వంలో కోడూరు రోడ్డు పూర్తి చేయడంతో

మాట్లాడుతున్న టిడిపి నాయకులు

పాటు నాగాయలంక మండలంలో దిగువ గ్రామాల్లో రహదారులు నియోజకవర్గంలో అనేక నూతన రహదారులు ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ కషితో నిర్మించారని, ఇంకా నిర్మిస్తున్నారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి వైస్ చైర్మన్ రాజనాల వీరబాబు, కూటమి నాయకులు బండే రాఘవ, మండలి రామ్మోహన్రావు, తండు గంగాధర్ కూటమి నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే గుర్రపుడెక్క సమస్య

ప్రజాశక్తి ఘంటసాల : రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంతోనే ఈ గుర్రపుడెక్క సమస్య ఏర్పడిందనీ రాష్ట్ర రైతు సంఘం నాయకులు హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ పేర్కొన్నారు. ఆదివారం ఆయన ఘంటసాల మండలం దేవరకోట వంతెన వద్ద నిలిచిన గుర్రపు డెక్కను నేతలు, రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్స్, మే నెలల్లో గుర్రపుడెక్కకు, తూటకాడ తొలగింపుకు పిచికారి చేయాల్సిన పనులు చేయకపోవటమే ఈ నిర్లక్ష్యానికి కారణమని అన్నారు. ఈ నామమాత్రపు వర్షానికే నారుమడులు, నాట్లు వేసిన చేలల్లో ఇలా 3 అడుగులు మేర ముంపుకు గురికావటం ఎంతో బాధాకరమన్నారు. నాట్లు వేసిన ప్రతి రైతు సుమారు. రూ.15 వేల వరకు నష్టపోయారన్నారు. వ్యవసాయ నాట్లు సమయంలో ఈ విపత్తు రావటం చాలా దురదష్టకరమన్నారు. యుద్ధప్రాతి పదికన ప్రతి వంతెన వద్ద పెద్దమిషన్లు పెట్టి గుర్రపుడెక్క, తూటుకాడ త్వరితగతిన తొలిగించాలన్నారు. అలాగే తూతూ మంత్రంగా ఒక్క చిన్న మిషన్ తో గుర్రపుడెక్క తొలగించటం రైతు కన్నీళ్లు తుడవటం కాదా అని మండిపడ్డారు. కేటాయించిన రూ.27.29 లక్షల నిధులు గుత్తేదారుడు ఏమి చేశాడనీ, అది నీటిపాలేనా అని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్, గుత్తికొండ రాము పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధితోనే దేశాభివృద్ధి :వైవిబి

ప్రజాశక్తి-ఉయ్యూరు : జాతిపిత మహాత్మా గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్య సాధనలో ప్రతిఒక్కరు భాగస్వామిలవ్వాలని ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షులు, సర్పంచుల సంఘం గౌరవ అధ్యక్షులు, మాజీ శాసన మండలి సభ్యులు వైవిబి రాజేంద్రప్రసాద్ పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని ముదునూరు గ్రామంలో ఏర్పాటు చేసిన సర్పంచుల సదస్సులో 'లిటిల్ రిపబ్లిక్ లుగా గ్రామాలు' అనే పుస్తకావిష్కరణ కార్యక్రమంలో ముఖ్యఅతిథిలుగా పాల్గొన్న రాజేంద్రప్రసాద్, మాజీ ఇంటెలిజెన్స్ ఐజి ఏబి వెంకటేశ్వరరావుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ గ్రామాలే దేశానికి పట్టుకొమ్మలని, గ్రామాభివద్ధి జరిగితేనే రాష్ట్రానికి, దేశానికి మేలు జరుగుతుందన్నారు. ప్రముఖ పాత్రికేయులు నాగేశ్వ రరావు, కృష్ణాజిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు గోలి వసంత కుమార్, ముదునూరు గ్రామ సర్పంచ్ లక్ష్మీ, సర్పంచులు పాల్గొన్నారు.

పలు ఆలయాల్లో ఆషాడ సారె సమర్పణ

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం మండలం కేసరపల్లి శివారు దుర్గాపురం నందుగల శ్రీ కనకదుర్గ అమ్మవారి దేవస్థానంలో దుర్గమ్మ వారికి ఆషాడసారె కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అమ్మవారికి సారే సమర్పించిన అనంతరం కుంకుమ పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సంఘ అధ్య క్షులు పన్యారం విష్ణుమూర్తి, కమిటీ సభ్యులు కప్పగంతుల లక్ష్మణ శాస్త్రి, గోపరాజు సత్య పవన్ కుమార్, మామిళ్ళపల్లి నాగ సుబ్బారావు, తిమ్మరాజు వెంకట సుబ్బారావు, సరస్వతుల వెంకట ఆదిత్య, స్వర్ణ చంద్రశేఖర్, నాగేశ్వరరావు, సంఘ సభ్యులు అనంత నారాయణ, సాయి, శ్రీ వాస్తవ తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-కంకిపాడు :** జనసేన పార్టీ పెద్దపులిపాక గ్రామ అధ్యక్షురాలు మేక స్వాతితేజ, జనసేన పార్టీ పెనమలూరు మండల ఉపాధ్యక్షులు మేక సుబ్బారావు దంపతుల ఆధ్వర్యంలో శ్రీ విజయ రాజరాజేశ్వరి సమేత విజయ సుందరేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో ఆషాడ మాస సారె మహోత్సవ కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి అమ్మిశెట్టి వాసు, తెలుగుదేశం యువ నాయకులు బోడె వెంకట్రామ్, పెనమలూరు జనసేన నాయకులు ముప్పా రాజా, పెద్దపులిపాక గ్రామ మహిళలు, జనసేన నాయకులు, కార్యకర్తలు, స్థానిక మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. **ప్రజాశక్తి-చల్లపల్లి :** ఆషాడ మాసం సందర్భంగా మండల పరిధిలోని లక్ష్మీపురంలో ఉన్న లక్ష్మీపార్వతి సమేత సోమేశ్వరస్వామి వారి ఆలయంలో మహిళలు అమ్మవారికి ఆషాడ సారె సమర్పించారు. భక్తి శ్రద్ధలతో శ్రీ అమ్మవారికి ఆషాడ సారెను మేళ తాళాలతో ఊరేగింపుగా తీసుకు వచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు బమిడిపాటిబాల సుబ్రహ్మణ్యం, ఈవో యార్లగడ్డ శ్రీనివాసరావు అమ్మ వారికి ఆషాడ సారె అందించి ప్రత్యేక పూజలు జరిపించారు. ఈవో దంపతులు కుటుంబ సమేతంగా కార్యక్రమంలో పాల్గొన్నారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. **ప్రజాశక్తి-గుడ్లవల్లేరు :** మండలంలోని అంగలూరు శ్రీ జ్ఞానసాయి మందిరం నుంచి ఆ మందిర వ్యవస్థాపకులు యలమంచిలి నాగమోహన్, లక్ష్మీ దంపతుల ఆధ్వర్యంలో స్థానిక శ్రీ గంగానమ్మ తల్లికి ఆషాఢం సారెను సమర్పించారు. అధికసంఖ్యలో ఈ కార్యక్రమంలో మహిళా భక్తులు పాల్గొన్నారు. మేళ తాళాలతో ఊరేగింపుగా బయలుదేరి అమ్మవారికి యలమంచిలి లక్ష్మీ సారెను భక్తిప్రపత్తులతో సమర్పించారు. అమ్మవారి పూజల్లో మహిళా భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

గన్నవరంలో..

కంకిపాడు మండలంలో...

కృష్ణాకరకట్ట ఇళ్లకు రిజిస్ట్రేషన్ పట్టాలివ్వాలి

♦ప్రచార యాత్రలో సిపిఎం నాయకులు బాబూరావు, కాశీనాథ్ డిమాండ్

ప్రజాశక్తి - విజయవాడ : కృష్ణలంక 21వ డివిజన్‌లోని రణదివేనగర్ కృష్ణాకరకట్ట ప్రాంతంలోని ఇళ్ళకు రిజిస్ట్రేషన్‌తో కూడిన పట్టాలివ్వాలని కృష్ణా కరకట్ట పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ప్రచార యాత్ర కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు మాట్లాడుతూ కృష్ణాకరకట్ట ఇళ్ళకు రిజిస్ట్రేషన్‌తో కూడిన పట్టాలివ్వాలని, ఇళ్ళ పైకప్పు మార్చుకునేందుకు అవకాశం ఇవ్వాలని, అవుట్‌ఫాల్ డ్రెయిన్ నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. కృష్ణాకరకట్టపై 40 సంవత్సరాలుగా వేల కుటుంబాలు నివసిస్తున్నాయని అన్నారు. అనేక ప్రభుత్వాలు మారాయి. ఏ ప్రభుత్వం వచ్చినా ఇక్కడి ఇళ్ళు తొలగించాలని చూశారని, ప్రతి సంవత్సరం వరదల్లో ఇళ్ళు మునిగిపోతూ ఉండేవని, ఆ వరదల నుండి రక్షణగోడ కట్టామని సిపిఎం డిమాండ్ చేస్తే అక్కడ గోడ ఎలా కడతారని ఆయా ప్రభుత్వాలు ఏద్దేవా చేశాయని అన్నారు. అయినా ప్రజా పోరాటాల వలన రక్షణగోడ నిర్మాణం చేపట్టాల్సి వచ్చిందన్నారు. 40 యేళ్ళుగా సొంత ఖర్చులతో ఇళ్ళు నిర్మించుకుని ఉంటున్నారని, వరదల్లో ఎన్నోసార్లు ఇళ్ళు మునిగి ఆస్తి నష్టపోయారని అన్నారు. ప్రభుత్వం ఇళ్ళు నిర్మించుకోవడానికి కానీ, నష్టపోయినపుడు ఏనాడు ఇక్కడి ప్రజలను ఆదుకోలేదని అన్నారు. బందర్ రోడ్డు కాల్వపై పది అంతస్తుల్లో లెమన్ ట్రీ హోటల్ నిర్మాణానికి అనుమతిచ్చారని, రైవస్ కాలువ పక్కనే ఉన్న పాత బస్టాండ్ స్థలాన్ని బడా కార్పోరేట్ కంపెనీకి ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధమైందని, బృందావన్ కాలనీలో ఉన్న మున్సిపల్ స్థలాన్ని రాఘవేంద్ర మఠానికి రూ.30 కోట్ల విలువైన స్థలాన్ని ఇచ్చేందుకు ప్రయత్నిస్తోందన్నారు. కృష్ణా కరకట్ట వాసులకు ఇళ్ళపై కప్పు మార్చుకోవడానికి అనుమతి లేనప్పుడు వారికి ఎలా అనుమతులిస్తున్నారని అన్నారు. దీనిపై స్థానిక ప్రజా ప్రతినిధులు కూడా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి రిజిస్ట్రేషన్‌తో కూడిన పట్టాలిక్కడి ఇళ్ళకు ఇచ్చేలా చూడాలని కోరారు. రిటైనింగ్‌వాల్ నిర్మాణం పూర్తయ్యి రెండేళ్ళు అవుతున్నా ఇప్పటికీ అవుట్‌ఫాల్ డ్రెయిన్ నిర్మాణం చేపట్టలేదన్నారు. దోమలు పెరిగిపోయాయన్నారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్ మాట్లాడుతూ ఇళ్ల పట్టాల సాధన కోసం ఈనెల 28న తలపెట్టిన కలెక్టర్‌కు వినతిపత్రాలు, అర్జీల కార్యక్రమంలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. నదికి అవతలివైపు రిటైనింగ్‌వాల్ నిర్మాణం లేకపోయినా వారికి రెగ్యులరైజేషన్ పేరుతో జి.ఓ 30 ప్రకారం రిజిస్ట్రేషన్ పట్టా ఇచ్చారని అన్నారు. కానీ రిటైనింగ్‌వాల్ ఉండి, ముంపుకు గురయ్యే అవకాశం లేని రణదివేనగర్ ప్రాంతంలో మాత్రం ఈ సమస్యను పరిష్కారం చేయడం లేదన్నారు. సమస్య పరిష్కారమయ్యే వరకు కృష్ణాకరకట్ట పరిరక్షణ కమిటీ పోరాటానికి సిపిఎం మద్దతు ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం తూర్పు నగర కార్యదర్శి పుప్పాల కష్ణ, కష్ణాకరకట్ట పరిరక్షణ కమిటీ నాయకులు కోటేశ్వరరావు, కోరాడ రమణ, కుమార్, శ్రీరాములు, గోపి, తాడి రమణ తదితరులు పాల్గొన్నారు.

ప్రచార యాత్రలో పాల్గొన్న బాబూరావు, కాశీనాథ్, కరకట్ట వాసులు

సిటీ ఆఫ్ టెర్రస్ గార్డెన్‌పై అవగాహన

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : కొండపల్లి మున్సిపాలిటీలోని మెప్మా (పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ) స్వయం సహాయక సంఘాల సభ్యుల సమావేశం మెప్మా సిఎమ్ఎమ్ (సిటీ మిషన్ మేనేజర్) శ్రీధరరావు, కోఆర్డినేటర్ వెంకట నరసమ్మ సహకారంతో, కొండపల్లి – 2 సచివాలయంలో జరిగింది. ఈ సమావేశానికి దాదాపు 150 మందికి పైగా హాజరయ్యారు. వంగూరి ప్రకాష్ మాట్లాడుతూ చేపట్టే కార్యక్రమాల గురించి వివరించారు. పద్మజ మాట్లాడుతూ వంటింటి వ్యర్థాలతో కంపోస్టు తయారీ గురించి, తద్వారా అధిక దిగుబడి పొందుతూ, పర్యావరణ పరిరక్షణకు ఎలా సహకరించవచ్చో వివరించారు. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మొక్కలు పెంచటం వల్ల ఉపయోగాలు ఆర్‌పిలు చొరవ తీసుకుని మరికొంత మందిని ప్రోత్సహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారికి సొర, పాలకూర విత్తనాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మెప్మా రిసోర్స్ పర్సన్స్ బి.ఉష, బి.స్వర్ణలత, ఎస్.దుర్గ, సిటిజి తరపున వంగూరి ప్రకాష్, బండి పద్మజ, ఆలూరి వెంకటేశ్వరావు, జి. సురేష్ బాబు పాల్గొన్నారు.

హిమాలయ యాంటీ హెయిర్ ఫాల్ షాంపు ఆవిష్కరణ

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ప్రతి రోజూ ఎదురయ్యే జుట్టు సమస్యలపై పరిష్కారం అందించాలన్న ఉద్దేశంతో హిమాలయ వెల్‌నెస్ ఒక కొత్త క్యాంపెయిన్ ప్రారంభించింది అని సంస్థ మార్కెటింగ్ డైరెక్టర్ రాగిణి హరిహరన్ తెలిపారు. నగరంలోని ఓ హెూటల్ నందు ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను తెలిపారు. ఈ క్యాంపెయిన్లో జుట్టు రాలడం తగ్గించడంలో ప్రసిద్ధి చెందిన 'భంగరాజ్' – 'జుట్టుకు రాజు' అనే పేరుతో ముందుకు వచ్చింది.అన్నారు. ప్రకతి ఆధారిత పరిష్కారాలకు హిమాలయ ఎంతో ప్రసిద్ధి చెందిందన్నారు. ఈ కొత్త భంగరాజ్ ప్రచారం హిమాలయపై ఉన్న విశ్వసనీయతను మరింత సమర్థవంతంగా చాటుతుందన్నారు. జుట్టుకు బలం, పోషణ ఇచ్చే లక్షణాలతో 'భంగరాజ్' ప్రసిద్ధి చెందినదన్నారు. ఈ ప్రచారం కేవలం జుట్టు రాలే సమస్యకు పరిష్కారం మాత్రమే కాదని, ఒకరి మీద ఒకరికి ఉండే నమ్మకాన్ని, స్నేహితుల మధ్య బంధాన్ని, జుట్టు సంరక్షణ కోసం హిమాలయపై నమ్మకాన్ని సంతోషంగా సెలబ్రేట్ చేయడం అన్నారు.

బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : విజయవాడ ఇండోర్ స్టేడియంలో (కెడిబిఎ) కృష్ణాజిల్లా బ్యాట్మెంటన్ అసోసియేషన్ నిర్వహించిన సీనియర్ ఉమెన్స్ డబుల్స్ బాడ్మింటన్ ఛాంపియన్ 2025 పోటీల్లో మొదటి ప్రైజ్ సాధించి ఈనెల 28ను తిరుపతిలో జరిగే రాష్ట్రాస్థాయి పోటీలకు పట్టణానికి చెందిన నాగార్జున హైస్కూల్ విద్యార్థి బి.కార్తిష అర్హాత సాధించింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ సిహెచ్.కృష్ణయ్య స్కూల్ యాజమాన్యం, సిబ్బంది ఆమెకు అభినందనలు తెలిపారు.

36 జిఒ ప్రకారం వేతనాలిస్తేనే సమ్మె విరమణ

- ఎపి మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు జ్యోతిబసు, ప్రవీణ్

- 26వ రోజుకు మున్సిపల్ కార్మికుల సమ్మె

ప్రజాశక్తి - విజయవాడ :

36 జీవో ప్రకారంగా వేతనాలు పెంచితేనే సమ్మె విరమిస్తామని ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ నగర నాయకులు జ్యోతిబాసు, ఆర్గనైజింగ్ కార్యదర్శి టి.ప్రవీణ్ స్పష్టం చేశారు. ఇంజినీరింగ్ కార్మికులు చేస్తున్న సమ్మె ఆదివారానికి 26వ రోజుకు చేరింది. వేతనాలు పెంచాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని కార్మికులు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జ్యోతిబాసు, ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇంజినీరింగ్ కార్మికులకు జీవోలో పేర్కొన్న విధంగా రూ.21వేలు రూ.24,500 చెల్లిస్తేనే సమ్మెను విరమిస్తామన్నారు. గత సమ్మె కాలపు 17 రోజుల ఒప్పందాలను అమలు చేయాలని కోరారు. ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుతో కార్మికుల మున్సిపల్ కార్మికుల సమ్మె జటిలంగా మారుతుందని అన్నారు. 26 రోజుల నుంచి వేలాదిమంది కార్మికులు రోడ్డు మీదకు వచ్చి ఆందోళన చేస్తున్నా మొద్దు నిద్ర పోతుందని అన్నారు. రాష్ట్రంలో పారిశుధ్యం క్షీణిస్తున్నప్పటికీ ప్రభుత్వానికి చీమకుట్టినట్లుగా కూడా లేదని పేర్కొన్నారు. విజయవాడ నగరంలో ఇంజినీరింగ్ కార్మికులకు మద్దతుగా మున్సిపల్ కార్మికులు ఏడు రోజుల నుంచి సమ్మెలో పాల్గొంటూ ఆందోళన చేస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వానికి ఏమాత్రం చీమకుట్టినట్లుగా కూడా లేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా తక్షణమే యూనియన్ నేతలతో చర్చలు జరిపి సమ్మెను విరమించేలా బాధ్యత తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రస్తుతం జరుగుతున్న సమ్మె కాలపు వేతనాలను కూడా చెల్లించాలని కోరారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు టి.తిరుపతమ్మ, స్టీఫెన్ బాబు, వెంకట్రావు, దుర్గారావు, చిన్న సాంబులు, తదితరులు పాల్గొన్నారు.

యువకవికి ప్రశంసా పత్రం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : విజయవాడ నగరంలో అంబేద్కర్ స్మృతి వనం ఆవరణంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సామాజిక న్యాయ శిల్పం వద్ద మల్లెతీగ సాహిత్య సేవా సంస్థ, బుక్ ఆఫ్ భారత్ రికార్డ్స్ వారి 'ప్రణామం ఈతరం కవుల కవితా వాగ్దానం' కవి సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. ఈ సమ్మేళనంలో మండలంలోని గండ్రాయి గ్రామానికి చెందిన యువ కవి లింగనబోయిన హనుమంతరావు 'ఆపరేషన్ సింధూర్'పై తన కవితను వినిపించారు. అనంతరం ఆ కార్యక్రమానికి విచ్చేసిన జిల్లా కలెక్టర్ లక్ష్మీశ చేతుల మీదుగా సన్మాన కార్యక్రమంలో అభినందన ప్రశంసా పత్రం, జ్ఞాపికను అందుకున్నారు.

ఆక్వాటిక్ రన్నరప్‌గా ఎన్‌టిఆర్ జిల్లా

ఛాంప్ విశాఖ - కృష్ణాకు తృతీయ స్థానం

వ్యక్తిగత ఛాంపియన్లుగా ఎన్‌టిఆర్, కృష్ణా స్విమ్మర్లు

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ (విశాఖపట్నం) :

విశాఖ బీచ్ రోడ్డులోని ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరిగిన పదో రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ బాలుర, బాలికల ఆక్వాటిక్ స్విమ్మింగ్ టోర్నీలో విశాఖపట్నం జిల్లా ఓవరాల్ ఛాంపియన్‌గా నిలిచి ట్రోఫీని కైవసం చేసుకుంది. ఎన్‌టిఆర్ జిల్లా రన్నరప్‌గా నిలిచింది. రెండు రోజులపాటు జరిగిన ఈ టోర్నమెంట్‌లో అద్భుతంగా రాణించిన విశాఖ స్విమ్మర్లు 15 స్వర్ణ, 27 రజిత, 23 కాంస్య పతకాలతో 179 పాయింట్లు సాధించి ఓవరాల్ ఛాంపియన్‌షిప్ ట్రోఫీని సొంతం చేసుకున్నారు. విశాఖతో పోటాపోటీగా రాణించిన ఎన్‌టిఆర్ జిల్లా స్విమ్మర్లు 22 స్వర్ణ, 12 రజిత, 9 కాంస్య పతకాలతో 155 పాయింట్లు సాధించి రన్నరప్ ట్రోఫీని గెలుచుకున్నారు. కృష్ణా జిల్లా తొమ్మిది స్వర్ణ, 10 రజిత, 15 కాంస్య పతకాలతో 90 పాయింట్లు సాధించి తృతీయ స్థానాన్ని దక్కించుకుంది. ఆదివారం జరిగిన ముగింపు కార్యక్రమంలో స్విమ్మింగ్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి మోహన్ వెంకట్రావు, విశాఖ జిల్లా కార్యదర్శి సంతోష్ శెట్టి, ఇతర ప్రతినిధులు ఎన్.విజయకుమార్ ఆర్.విజయ్ కుమార్ విజేతలకు ట్రోఫీలు, పతకాలు అందజేశారు.

వ్యక్తిగత విజేతలు వీరే..

గ్రూప్–3 బాలుర విభాగంలో బలంగా స్వామి నాయుడు (ఏలూరు), బాలికల విభాగంలో యామర్తి పార్థవి (కృష్ణ), గ్రూప్ – 2 బాలుర విభాగంలో బి.పృథ్వీరాజ్ (ఎన్‌టిఆర్), బాలికల విభాగంలో యానా జైన్ (ఎన్‌టిఆర్) వ్యక్తిగత ఛాంపియన్లుగా నిలిచి పతకాలను అందుకున్నారు. అదేవిధంగా గ్రూప్–1 బాలుర విభాగంలో జక్క గణేష్ (విశాఖపట్నం), పి.అవినాష్ (శ్రీకాకుళం), సుగాలి కార్తికేయ (అనంతపురం), బాలికల విభాగంలో ఎన్.పావని సరయు (ఎన్‌టిఆర్) వ్యక్తిగత ఛాంపియన్ అవార్డులు అందుకున్నారు.

ఛాంప్‌గా నిలిచిన విశాఖ క్రీడాకారులు

రన్నరప్‌గా నిలిచిన ఎన్‌టిఆర్ జిల్లా జట్టు

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం
పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...
మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218
విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.